భార్య హత్య
హోంగార్డు ఘాతుకం 2లో

నేడు పవిత్రోత్సవాలకు
అంకురార్పణ 6లో

జల'దారులు' మధ్య పత్రంలో
బాగుపడితేనే సిరులు

ఈనాడు
కడప
సోమవారం 21 ఆగస్టు 2017 16 పేజీలు



చేతిలో కోట్లు
పని జరిగితే ఒట్టు

- కడప నగరపాలక సంస్థ పరిధిలో 'అమృత్' నిధులకు కాలగ్రహణం
- రాజకీయ ఆధిపత్యం నేపథ్యంలో రగడగా మారిన వ్యవహారం
- ఆ ఇద్దరు నాయకులదే కీలకపాత్ర..
- మొక్కుబడిగా మారిన టెండర్ల ప్రక్రియ.. గుత్తేదార్లు ముందుకురారాయె..
- నిరుపయోగంగా మారిన నిధులు.. పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు

ఈనాడు, కడప

వాటాల కోసం వెంపర్లాడుతుండడం అధ్వానంగా మారింది.. కాసుల వేటలో కక్కుర్తిపడుతుండడం సమస్యగా తయారవుతోంది.. ఆ ఇద్దరి మధ్య పోట్లాట ఆధిపత్యాన్ని ప్రస్ఫుటిస్తుండగా.. అభివృద్ధి దిశగా పడాల్సిన అడుగులు ఆదిలోనే ఆగిపోతున్నాయి. పేదల సమస్యలను తీర్చాల్సిన పెద్దలే గద్దల్లా మారుతుండడం, మొక్కుబడి టెండర్లను సాకుగా చూపుతూ చక్కబెట్టేస్తుండడం వారికే చెల్లింది. అడుగడుగునా కన్పిస్తోన్న ఆధిపత్యం రాజకీయ రగడకు కారణమవుతూ ఉండగా.. కడప నగరపాలకసంస్థ పరిధిలో 'అమృత్' నిధులకు కాలగ్రహణం పట్టిన తీరు కళ్ల ముందే కన్పిస్తోంది. వాస్తవానికి ఎంతో ఉన్నతాశయంతో కేంద్ర ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను పెంచేందుకుగాను అమృత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా 500 పట్టణాలు, నగరాలకు అవకాశం కల్పిస్తే అందులో కడప, ప్రొద్దుటూరు చోటు దక్కించుకున్నాయి. తద్వారా నిరుపేదలకు కనీస మౌలిక వసతులు కల్పించాలనేది ఉద్దేశం. అందులోనూ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నది ఈ పథకం ముఖ్య లక్ష్యం. ఆ క్రమంలోనే కడప నగరపాలకసంస్థ పరిధిలోనూ కొత్త పనులకు అవకాశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజాప్రతినిధులు అందుకు సహకరించి ప్రగతికి బాటలేయాలన్న దిశగా కార్యాచరణ రూపుదిద్దుకుంది. అందులో భాగంగానే 2015-16 సంవత్సరానికి కడప నగరానికి మొదటివిడత కింద రూ.43.80 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల్లో రూ.50 లక్షలు వెచ్చించి రెండు ఉద్యానవనాల నిర్మాణానికి అధికారులు పూనుకున్నారు. ఎస్‌బీఐ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీలను ఇందుకు ఎంపిక చేశారు. ప్రస్తుతం ఈ ఉద్యానవనాల పరంగా టెండర్ల ప్రక్రియ పూర్తికాగా.. పనులు జరుగుతున్నాయి. ఇందులో వేగం లేక నత్త నడకను తలపిస్తున్నాయి. ఇక మిగిలిన రూ.43.30 కోట్లతో నగరంలో తాగునీటి సమస్యను తీర్చే దిశగా యోచన జరిగింది. ఈ నిధులతో 6 ఓవర్‌హెడ్ ట్యాంకులు, వాటి ద్వారా పైపులైన్లు నిర్మించాలనేది ఉద్దేశం. తద్వారా 24,439 వేల కొత్త కుళాయి కనెక్షన్లు

- మిగతా 7లో

తిరిగి పాగా..
అవినీతి పక్కా..!



- రవాణా కార్యాలయంలో మళ్లీ తిష్టవేస్తున్న సహాయకులు
- గుట్టుచప్పుడు కాకుండా అక్రమాలకు సహకారం
- కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్న దళారులు
- డ్రైవింగ్ పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ
- షోరూముల్లో తప్పులతడకగా రిజిస్ట్రేషన్లు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: రవాణాశాఖ కార్యాలయాల్లో దళారులు, సహాయకుల బెడద లేకుండా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రవాణాశాఖ కార్యాలయాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. గతంలో కొంతకాలంగా కడప రవాణాశాఖ కార్యాలయంలోకి దళారులు వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేశారు. ఏకంగా అధికారులే కార్యాలయ ఆవరణలో కుర్చీలు వేసుకుని కూర్చుని వాహనదారులను మాత్రమే లోనికి పంపించేవారు. కానీ రాను రాను పరిస్థితి తారుమారైంది. దళారులు ఎంచక్కా కార్యాలయంలోకి వచ్చి తమ

- మిగతా 7లో

వారం రోజులు గడవకముందే

ప్రొద్దుటూరు డీఎస్పీ బదిలీ



కడప నిఘా విభాగం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు డీఎస్పీగా వారం క్రితం విధుల్లో చేరిన ఆర్ల శ్రీనివాసులు బదిలీ అయినట్లు తెలుస్తోంది. అధికార తెదేపాలోని ఇద్దరు ముఖ్య నాయకుల మధ్య విభేదాల కారణంగానే ఈయన బదిలీ అయ్యారనే ప్రచారం సాగుతోంది. అనంతపురం పోలీసు శిక్షణ కేంద్రంలో పని చేస్తున్న ఆర్ల శ్రీనివాసులు ఈనెల 14న ప్రొద్దుటూరు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. వారం తిరక్కముందే ఆయన బదిలీ అవటం జిల్లా పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాజకీయ ఒత్తిడితోనే బదిలీ జరిగినట్లు వారు అభిప్రాయపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో కార్యాలయంలో ఉన్న డీఎస్పీకి తక్షణమే కడపకు రావాలంటూ ఎస్పీ కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది. దీంతో ఆయన కడపకు వెళ్లి ఎస్పీని కలిసినట్లు తెలుస్తోంది. తరువాత ప్రొద్దుటూరులోని తన కార్యాలయానికి చేరుకున్న ఆయన తాను వారం రోజులపాటు సెలవుపై వెళ్తున్నట్లు సిబ్బందికి చెప్పి నిష్క్రమించారు. తిరిగి ఆయన అనంతపురానికి వెళ్లిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారపార్టీలోని రాజ్యసభ సభ్యుడు, ఓ సీనియర్ నేత మధ్య విభేదాలే ఈయన బదిలీకి అసలు కారణమని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

పెరిగిన అరటి ధర | టన్నుకు 18 నుంచి 20 వేల రూపాయల వరకూ చెల్లిస్తున్న వ్యాపారులు | తమిళనాడు, మహారాష్ట్రల్లో దిగుబడులు తగ్గిపోవడమే కారణం | జిల్లా రైతుల మోములు కళకళ

ఆశల అరటికి రెక్కలొచ్చాయ్..!


ధరల పెరుగుదలతో అరటి సాగుకు శ్రీకారం .. పిలకల చేరవేత



లింగాల, న్యూస్‌టుడే: పొరుగున ఉన్న తమిళనాడు, మహారాష్ట్రల్లో అరటి దిగుబడులు తగ్గిపోవడంతో ప్రస్తుతం జిల్లాలో అరటిపంట ప్రాధాన్యం పెరిగిపోయింది. వ్యాపారులు టన్నుకు 18 నుంచి 20 వేల రూపాయల వరకూ వెచ్చించి కొనుగోలుచేస్తుండడంతో జిల్లా రైతుల ఆనందం అంతా ఇంతాకాదు. ఈ ఏడాది జూన్‌లో టన్ను రూ.20 వేల ధర పలికింది. అయితే మార్కెట్లోకి విస్తారంగా అరటి దిగుబడులు రావడంతో టన్ను రూ.10 వేలకు ధర పడిపోయింది. అరటి పంటకు గిట్టుబాటు ధర రాదని ఆందోళన చెందుతున్న రైతులు ఇప్పుడు ఊహించనివిధంగా ధరలు పెరగడంతో సంతోషం

- మిగతా 7లో

తలను గోడకేసి బాది భార్య హత్య

- హోంగార్డు ఘాతుకం.. కేసు నమోదు
- నలుగురు పిల్లలకు కరవైన తల్లి


నాలుగేళ్ల కుమార్తె నిశిత


ఆరునెలల కుమారుడు సిద్ధార్థ

సిద్దవటం, న్యూస్‌టుడే : అనుమానంను ఓ హోంగార్డును కర్కోటకుడిగా మార్చింది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన అతడు భార్య తలను గోడకు బాది దారుణంగా హతమార్చాడు. ఆరునెలల నుంచి ఆరేళ్ల మధ్య వయసున్న నలుగురు పిల్లలకు తల్లిని దూరం చేశాడు. హృదయ విదారకమైన ఈ సంఘటన సిద్దవటం మండలం భాకరాపేట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఇందుకు సంబంధించి ఒంటిమిట్ట సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా


ఆదిలక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవికుమార్


ఆదిలక్ష్మి (పాతచిత్రం)

ఉన్నాయి.. సిద్దవటం మండలం భాకరాపేటకు చెందిన జగిలి రాజశేఖర్ సుండుపల్లి మండలం ఈడిగపల్లి గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి అలియాస్ అమ్ములును ఏడేళ్లకిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో మొదటి కుమార్తె శ్రీచరితకు ఆరేళ్ల వయస్సు ఉండగా, రెండో కుమార్తె సుదేష్ణ (5), మూడో కుమార్తె నిశిత (4), నాలుగో సంతానమైన కుమారుడు సిద్ధార్థకు ఆరు నెలల వయస్సు ఉంది. రాజశేఖర్ ఏడేళ్లుగా హోంగార్డుగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం కడపలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజశేఖర్ రోజూ మద్యం తాగొచ్చి భార్య ఆదిలక్ష్మితో గొడవపడి కొట్టేవాడని సీఐ తెలిపారు. వివాహేతర సంబంధం అంటగట్టి ఆమెను హింసించేవాడని వివరించారు. శనివారం రాత్రి కూడా మద్యం తాగి ఇంటికొచ్చిన ఆయన భార్యతో గొడవపడ్డారన్నారు. ఆదివారం తెల్లవారుజామున మరోమారుగా మద్యం తాగి తీవ్రంగా కొట్టాడన్నారు. అనంతరం తలను గోడకేసి బలంగా బాదడంతో తీవ్రంగా గాయపడిన ఆమె కోమాలోకెళ్లిందన్నారు. సమాచారం తెలియగానే అక్కడిళ్లి పరిశీలించామన్నారు. అచేతనంగా ఇంట్లో పడున్న ఆమెను ఆటోలో రిమ్స్‌కు తీసుకెళ్లామని చెప్పారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యుడు తెలిపారన్నారు. రిమ్స్‌లోనే మృతదేహానికి శవపంచనామా నిర్వహించినట్లు చెప్పారు. ఆదిలక్ష్మి తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోంగార్డు రాజశేఖర్‌పై హత్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు. ఆదిలక్ష్మి హత్యతో ముగ్గురు కుమార్తెలు, కుమారుడు తల్లిలేని పిల్లలుగా మారడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో భాకరాపేటలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


నిందితుడు రాజశేఖర్

అవ్వకు ఆపన్నహస్తం

- రోడ్డుపై సొమ్మసిల్లి పడిన అవ్వను ఆసుపత్రికి తరలించిన 'న్యూస్‌టుడే'
- క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగింత

దూర ప్రాంతం నుంచి జీపులో ప్రయాణం.. దిక్కుతెలియని గమ్యం.. రాయచోటికి రాగానే పండుటాకును వదిలేసి వెళ్లిన వైనం.. ఓవైపు క్షుద్బాధ.. సహకరించని శరీరంతో పండుటాకు విలవిల్లాడింది.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడిపోవడంతో అచేతన స్థితికి చేరుకుంది.. చివరికి 'న్యూస్‌టుడే' గుర్తించి వృద్ధురాలికి చేయూతనివ్వడంతో క్షేమంగా ఇంటికి చేరింది..


సొమ్మసిల్లి పడిన వృద్ధురాలు నాగమ్మ


అవ్వను ఇంటికి తీసుకెళ్తున్న కుమారుడు, బంధువులు


ఆసుపత్రిలో అవ్వకు చికిత్సలు అందిస్తున్న వైద్య సిబ్బంది

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: శ్రావణమాసం ముగింపు సందర్భంగా కడప జిల్లా చక్రాయపేట మండలంలోని గండి అంజన్న దర్శనానికి వచ్చిన ఓ వృద్ధురాలు రాయచోటి పురపాలికలోని డైట్ ఉన్నత పాఠశాల ఎదురుగా రోడ్డుపై అచేతన స్థితిలో సొమ్మసిల్లి పడిపోయింది. చుట్టుపక్కల దుకాణదారులు ఉన్నా అవ్వను పట్టించుకోలేదు. అటువైపు మధ్యాహ్నం 2గంటల సమయంలో 'న్యూస్‌టుడే' వెళ్తూ అవ్వ స్థితిపై ఆరాతీసింది. ఉదయం అవ్వను ఎవరో జీపులో ఇక్కడ వదిలేసి వెళ్లారని దుకాణదారులు చెప్పారు. ఆమె మాత్రం ఎండలో రోడ్డుపై లేవలేని పరిస్థితిలో పడి ఉన్నా పట్టించుకోలేదు. స్పందించిన 'న్యూస్‌టుడే' ఇద్దరి వ్యక్తుల సహాయంతో ఆమెను ఆటోలో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి వైద్యసిబ్బందిచే చికిత్సలు చేయించి ఆహారం అందించారు. ఆమెను పలకరిస్తే తన పేరు బందోళ్ల నాగమ్మ అని, తమది చిత్తూరు జిల్లా పెద్దమండెం మండలమని రోదిస్తూ చెప్పింది. గండి నుంచి ఆర్టీసీ బస్సులో రాకపోవడంతో ఓ జీపులో ఎక్కడంతో ఈమెను బస్టాండు సమీపంలో వదిలి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆమె ఊరికి వెళ్లేందుకు బస్సు తెలియక, దిక్కుతోచక, శరీరం సహకరించక నీరసించి అక్కడే రోడ్డుపైనే పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చేర్చడంతో తనను ఊరికి చేర్చండయ్యా అని ప్రాధేయపడింది. చేతిలో ఒక సంచి, కొబ్బరి చిప్ప, దుస్తులు మాత్రమే ఉన్నాయి. ఆమెకు ఆసుపత్రి వైద్య సిబ్బంది చికిత్సలు అందించారు. తన బంధువులైన ఆనంద, సహదేవి అని ఆమె కలవరించింది. తన కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి తనను ఇంటికి తీసుకెళ్లాలని ఆమె వేడుకుంది. చివరికి ఆమె సంచిలో ఉన్న చరవాణి సంఖ్యకు ఫోన్ చేయడంతో ఆమె కుమారుడు ఆదినారాయణ, కోడలు సరోజమ్మ, బంధువులు వచ్చి ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు శ్రావణ వారోత్సవాల సందర్భంగా గండికి వెళ్లి వస్తానని రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిందన్నారు. ఇంటికి రాకపోవడంతో తాము ఆందోళన చెంది ఈమె కోసం గాలిస్తున్నామన్నారు. అమ్మను ఆసుపత్రిలో చేర్పించి తమకు అప్పగించినందుకు వారు 'న్యూస్‌టుడే'కు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లి ఎంపీపీకి తీవ్ర గాయాలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ అంబా బత్తిన రెడ్డెయ్య(45) తీవ్రంగా గాయపడినట్లు ట్రాఫిక్ ఎస్.ఐ మహమ్మద్ రఫి పేర్కొన్నారు. రెడ్డెయ్యతో పాటు చంద్రమౌళి మరో ఇరువురికి ద్విచక్రవాహనంపై రాయచోటి వైపు వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెడ్డెయ్య తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఆయనతో పాటు చంద్రమౌళి, మరో వ్యక్తి స్వల్పంగా గాయపడడంతో వీరిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఎంపీపీ రెడ్డెయ్యకు ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు తిరుపతి రుయాసుపత్రికి తరలించామని వివరించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీపీ రెడ్డెయ్య

మాండవ్య నదిలో పడి వ్యక్తి మృతి

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణం సమీపంలోని గ్రూపు థియేటర్స్ వద్ద మాండవ్య నదిలో ఆదివారం పోలీసులు ఓ మృతదేహాన్ని కనుగొన్నారు. నదిలో ఉన్న స్వల్ప నీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని సమాచారం మేరకు పాత రాయచోటి ప్రాంతంలో ఆరా తీయగా జయచంద్ర అనే వ్యక్తిగా స్థానికులు గుర్తించారని ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నారు. మృతుడికి భార్య పిల్లలు ఉండగా జీవనాధారం కోసం భార్య విదేశాలకు వెళ్లింది. జయచంద్ర దురలవాట్లకు లోనై అతిగా మద్యం సేవించి నీటిలో పడి మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తి

జిల్లాలో జోరు వాన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని మండలాల్లో ఆదివారం ఓ మోస్తారు వర్షం కురిసింది. రాజుపాలెంలో అత్యధికంగా 34.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సింహాద్రిపురంలో 6.0, తొండూరులో 4.2. వేంపల్లెలో 1.2, లింగాలలో 4.4, పులివెందులలో 3.2, మైదుకూరులో 24.6, దువ్వూరులో 20.4, చాపాడులో 10.4, ప్రొద్దుటూరులో 16.2, కొండాపురంలో 21.0, ముద్దనూరులో 8.6, మైలవరంలో 11.2, జమ్మలమడుగులో 7.8, రాజంపేటలో 5.6. పెనగలూరులో 4.2, కోడూరులో 8.6, ఓబులవారిపల్లెలో 23.6, పుల్లంపేటలో 9.0, చిట్వేలిలో 10.4, పోరుమామిళ్లలో 3.6, బీకోడూరులో 16.4, బద్వేలులో 8.0, గోపవరంలో 10.8, బిమఠంలో 24.4, సిద్దవటంలో 8.4, అట్లూరులో 5.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. గాలివీడులో 18.4, చక్రాయపేటలో 2.4, లక్కిరెడ్డిపల్లెలో 11.0, టి.సుండుపల్లెలో 21.2, వీరబల్లిలో 11.8, సంబేపల్లెలో 4.2, చిన్నమండెంలో 3.0, కడపలో 3.2, వల్లూరులో 4.6, సీకేదిన్నెలో 2.2, చెన్నూరులో 11.2, ఖాజీపేటలో 27.4, కమలాపురంలో 3.8, వీరపునాయునిపల్లెలో 2.2, రాయచోటిలో 24.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

కార్మికుల దృష్టికి వాస్తవాలు

భవిష్యత్తులో బలమైన ఉద్యమం

చిన్నచౌకు (కడప, న్యూస్‌టుడే): ఆర్టీసీలో జరుగుతున్న వాస్తవాలను కార్మికుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వైవీ.రావు అన్నారు. కడపలోని హోచిమిన్ భవన్‌లో ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఈయూ నాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంప్లాయిస్ యూనియన్ 66వ వసంతంలోకి అడుగు పెట్టామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని కార్మిక నాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు కడపలోని ఈయూ నాయకులందరికీ శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆర్టీసీ పరిస్థితి బాగా లేదన్నారు. కార్మికులకు వాస్తవాలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం భవిష్యత్తులో బలమైన ఉద్యమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. అలానే రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి నిధులు కేటాయించాలని కోరారు. ఆర్థికంగా ఆర్టీసీని ఆదుకోవాలన్నారు. త్వరలో అద్దె బస్సుల కాలపరిమితి అయిపోతుంది, కావున వాటి స్థానంలో ఆర్టీసీ బస్సులను ప్రవేశ పెట్టాలని డిమాండు చేశారు. హైదరాబాదులో 13 ఆస్తులను గుర్తించామన్నారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఏపీకి 52, తెలంగాణాకు 42 శాతం చొప్పున ఆర్టీసీ ఆస్తులను పంచాలని తెలిపారు. ప్రతి ఒక్క కార్మికుడు సంస్థ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మూడేళ్ల కొకసారి కొత్త బ్రీతింగ్ అనలైజర్ పరికరాలు తెప్పించాలి, 30 వేల మందికి తనిఖీ చేసిన తరువాత పరికరాలను పక్కన పెట్టాలన్నారు. ఇప్పటికీ వాటినే ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. పక్కన పెట్టిన డ్రైవర్‌ను తక్షణం విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర నాయకులు హనుమంతరావు, పీఎస్ఎన్.రావు, ఎండీ.ప్రసాద్, నారాయణతో పాటు జోనల్ నాయకులు శ్యామూల్‌బాబు, నర్సయ్య, జిల్లా నాయకులు కెకె.కుమార్, ఎన్ఆర్.శేఖర్, నారాయణ, ఏఆర్.మూర్తి, పీసీ.శేఖర్, రాముతో పాటు పలువురు ఉన్నారు.


మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షులు వైవీ.రావు, పక్కన నాయకులు

రాయచోటిలో ఘర్షణ..ఒకరికి కత్తిపోట్లు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటి పట్టణం కొత్తపల్లిలో ఇరువర్గాలు మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరు కత్తిపోట్లకు గురయ్యారు. కొత్తపల్లిలో నివాసం ఉంటున్న ఫకృద్దీన్(45) అదే ప్రాంతానికి చెందిన ముస్తఫ్అలీఖాన్ కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. రెండు నెలల క్రిందట ఫకృద్దీన్, అతని భార్య కలిసి ముస్తఫా చెల్లిలితో చిన్న పిల్లల విషయమై ఘర్షణ పడ్డారని ఎస్.ఐ రమేష్‌బాబు పేర్కొన్నారు. అప్పట్లో గల్ఫ్‌లో ఉన్న ముస్తఫా ఇంటికి తిరిగి వచ్చారు. పాత ఘర్షణ విషయం మనసులో పెట్టుకున్న ముస్తఫా వర్గీయులు ఫకృద్దీన్‌తో ఘర్షణకు దిగి ఈ దాడికి పాల్పడ్డారని ఆయన తెలిపారు. తీవ్రంగా గాయపడిన ఫకృద్దీన్‌ను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో వేలూరు సీఎంసీకి తరలించారని ఆయన వివరించారు. ఘర్షణపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేస్తం... అందనంత దూరం

● ఏడాదిగా కన్పించని రుతురుమాళ్లు ● కిషోర బాలికలకు తప్పని ఇక్కట్లు



కిషోర బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు కనుమరుగవుతున్నాయి. కేవలం బాలికా విద్యకే ప్రాధాన్యం ఇస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి అందించాల్సిన కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యాయి. వ్యక్తి గత పరిశుభ్రత కేవలం మాటలకు, కాగితాలకే పరిమితమవుతున్నాయని గతంలో మాదిరిగా కిషోర బాలికలకు అందిస్తున్న ఏ పథకం కూడా నేడు లేదని పలువురు విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థినుల ఆరోగ్యాన్ని కాపాడుతామంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వం నేస్తం పథకాన్ని అందనంత దూరంలో పెట్టేసింది. దీంతో పాటుగా మా ఇంటి మహాలక్ష్మి పథకాన్ని అటకెక్కించింది. నేస్తం పథకంలో పాఠశాలలకు వెళ్లే కిషోర బాలికలకు నాప్‌కిన్లు అందించాలన్నది ఈ పథకం ఉద్దేశం. సర్వశిక్ష అభియాన్ నిధులతో కొనసాగిన ఈ పథకాన్ని ఎందుకో నిలిపేశారు. దీంతో ఇళ్లకు పరుగులు తీస్తున్న వారు కొందరైతే, ఇంకొంతమంది ఉపాధ్యాయుల పంచన చేరి వారి నుంచి డబ్బులు తీసుకుని కొనుగోలు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో వీరు పడే ఇబ్బందులు వర్ణనాతీతం.



కిషోర బాలికలు

అరవిందనగర్, (న్యూస్‌టుడే, కడప): గ్రామీణ విద్యార్థుల కష్టాలెన్నో... గ్రామీణ ప్రాంతాల్లోని కిషోర బాలికలల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించి రుతురుమాల్లు పంపిణీ చేసే వారు. ఈ పథకం విద్యార్థినులకు చేరుకోగానే నిధుల లేమి పేరుతో పథకాన్ని నిలిపేశారు. గతేడాది జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రాయితీతో రుతు రుమాళ్లను పంపిణీ చేసింది. వాస్తవానికి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని బాలికల కోసం 2012లో నేస్తం పథకాన్ని ప్రారంభించారు. సర్వశిక్ష అభియాన్ నిధులతో ప్రభుత్వం నాప్‌కిన్లను పంపిణీ చేసింది. అంతేగాకుండా మహిళా సైన్సు ఉపాధ్యాయులకు హైదరాబాద్, కడపలో ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. పాఠశాలల్లోని కొంతమంది సిబ్బందికి కూడా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి నాప్‌కిన్లను తయారు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. తయారు చేసిన నాప్‌కిన్లను ఆయా పాఠశాలలకు మండల విద్యాశాఖాధి కార్యాలయం నుంచి గట్టలు గట్టలుగా సరఫరా చేసే వారు. ఇది ఎంతో ఉపయోగకరంగా విద్యార్థినులకు ఉండేది. ప్రస్తుతానికి ఈ పథకాన్ని ప్రభుత్వం అటకెక్కించింది. ఏడాదిగా అటు అధికారులుగానీ, ఇటు ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోకపోవడంతో కష్టాలు విద్యార్థులపరమైనాయి.

● రెండేళ్లకు ఒకసారే.. గడిచిన రెండేళ్లుగా రుతురుమాళ్లు పంపిణీ కాలేదు. గతేడాది ద్వితీయార్థంలో వైద్య ఆరోగ్యశాఖ ఆసుపత్రుల్లో మిగిలిన నాప్‌కిన్లను రాయితీ రూపంలో పాఠశాలల్లో పంపిణీ చేశారు. అందులో ఒక్కో పొట్లంలో సుమారు ఎనిమిది ఉండటంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఉపయోగకరంగా ఉండేది. కానీ అవి పంపిణీ కాకపోవడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థినీలు పాత గుడ్డలతో సర్దుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా మందికి ఇన్ఫెక్షన్ (సంక్రమణ) బారినపడి కనీసం వారం రోజుల వరకు పాఠశాలలకు గైర్హాజరవుతున్నారు.

నిధుల లేమితో ఇబ్బందులు

గతంలో విద్యార్థినులకు నాప్‌కిన్లు ఉచితంగా పంపిణీ చేసే వాళ్లం. ప్రస్తుతం నిధుల లేమితో వాటిని సరఫరా చేయడం లేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థినుల్లో నాప్‌కిన్ల సమస్య ఎక్కువగా ఉంటుందనుకుంటున్నాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- శైలజ, జిల్లా విద్యాశాఖాధికారి

పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థినులకు మాత్రం ఆ రోజుల్లో సమీపంలోని ఇళ్లకు పరుగులు తీస్తుంటే ఇంకొంత మందికి ఉపాధ్యాయులు కొంతడబ్బు ఇచ్చి దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాలని సూచిస్తూ జాగ్రత్తలు చెబుతుండటం ప్రస్తావనర్హాం.

● కన్పించని బాలికలకు భరోసా.. పాఠశాలలకు వెళ్లిన సమయంలో నెలసరి అయినట్లైతే విద్యార్థినులకు పాఠశాలల్లో నాప్‌కిన్లు అందుబాటులో ఉండేవి. సమస్య పరిష్కారం అయ్యేది అయితే ప్రస్తుతానికి ఈ పథకం నిలిపి వేయడంతో విద్యార్థులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దీంతో సాంకేతికంగా స్టెరిలైజేషన్ (క్రిమి రహితంగా) దుస్తులు లేకపోవడంతో అనారోగ్యం పాలై ఇతర విద్యార్థులను కూడా ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు పేద మధ్య తరగతికి చెందిన వారే ఉండటంతో వారి వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై భరోసా కల్పించేలా నాప్‌కిన్ల పథకాన్ని అమలు చేస్తే ఎంతో మేలుగా ఉంటుందని పలువురు విద్యార్థినీలు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నాప్‌కిన్లు ఎంతో సురక్షితం



కిషోర బాలికలకు నాప్‌కిన్లు ఎంతో సురక్షితం. గతంలో వాటిని ప్రభుత్వమే ఉచితంగా అందించేది. ప్రస్తుతం సరఫరా కావడం లేదు. మా పాఠశాలలకు వచ్చేది అంతా పేదలే. విద్యార్థినులు ఇబ్బందులు పడేది వాస్తవమే. ఇంట్లో తల్లిదండ్రులే ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నాం.

- సుశీల, ప్రధానోపాధ్యాయురాలు, కాగితాలపెంట.

పాఠశాల నుంచే చైతన్యం



విద్యార్థినుల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా అమ్మాయిలకు అన్ని రకాల సూచనలిస్తున్నాం. రుతు సమయంలో దుస్తులు ఉపయోగించకుండా క్రిమి రహిత దుస్తులను ఉపయోగించాలని చెబుతున్నాం. నీటిని ఎక్కువగా తాగాలని సూచిస్తున్నాం. అయితే ప్రభుత్వం రుతు రుమాల్లు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

- కృష్ణవేణి, సైన్సు ఉపాధ్యాయురాలు

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



ఇది విద్యార్థినుల సమస్య. అందుకే రోజుకు ఒక రూపాయి చొప్పున పొదుపు చేసుకుని వాటిని కొనుగోలు చేసుకోవాలని పిల్లలకు సూచిస్తున్నాం. రుతు సమయంలో విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా పలు సూచనలిస్తున్నాం. కొన్ని సమయాల్లో ఉపాధ్యాయులమే ప్రత్యేక దృష్టి సారించి వారికి మేలు చేస్తున్నాం. ప్రభుత్వం కూడా ఆ దిశగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- రాణి కళావతి, సైన్సు ఉపాధ్యాయురాలు



పర్యావరణ గణపతి.. పాహిమాం

ఈ నెల 25న వినాయక చవితి. ఈ పండుగను పురస్కరించుకొని పర్యావరణ హిత గణపతి విగ్రహాలను వినియోగిద్దాం. మట్టి, కూరగాయలు, వివిధ రకాల ఫలాలు, మిఠాయిలు తదితర తినుబండారాలతో పాటు మట్టిలో సులభంగా కలిసిపోయే గుణాలు గల పదార్థాలతో మట్టి ప్రతిమల్ని తయారు చేయొచ్చు. వివిధ రకాల బొజ్జ గణపయ్యలతో పాటు తల్లిదండ్రులైన శివ పార్వతులతో కలిసి ఉన్న ఆదిదేవుని రూపాలను ఆవిష్కరించొచ్చు. ఇలా మీరు తయారు చేసిన గణపతి బొమ్మలు, గీసిన చిత్రాలను 'ఈనాడు'లో ప్రచురించదలిచాం. మీరు చేయాల్సిందల్లా మీరు సృజనాత్మకంగా తయారు చేసిన ప్రతిమ చిత్రాలను మీ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ కింది పేర్కొన్న వాట్సప్ నెంబరుకు పంపడమే. వాటిలో విభిన్నమైన వాటిని ఎంపిక చేసుకొని ప్రచురిస్తాం. ఇంకెందుకాలస్యం. మట్టి గణపతికి జై కొట్టండి.. పర్యావరణ హితైషిగా మీ మార్కును చాటండి.

వాట్సప్ సంఖ్య : 9059913284,

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 'సెమిస్టర్'

నైపుణ్యాభివృద్ధి దిశగా విద్యా బోధన ● విశ్వవిద్యాలయం విద్యార్థి సేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే

రాజంపేట, న్యూస్‌టుడే : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో సెమిస్టర్ విధానానికి శ్రీకారం చుట్టినట్లు ఆ విశ్వవిద్యాలయం విద్యార్థి సేవా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. రాజంపేట ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈఏడాది నుంచి ఓపెన్ డిగ్రీలో సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని, దీనివల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఏడాదంతా చదివి పరీక్ష రాయడం కంటే ఆరు నెలలకు ఒకసారి (సెమిస్టర్) పరీక్షలు రాయటం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. దేశంలోనే సార్వత్రిక విశ్వవిద్యాలయాల్లో మొదటిసారిగా డిగ్రీతో పాటు ఎంబీఏ, బీఎల్ఐఎస్సీ వంటి కోర్సుల్లో సెమిస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత తమ యూనివర్శిటీదేనని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడడంతో పాటు వారికి మంచి చేకూర్చే లక్ష్యంతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఇదే సమయంలో విద్యార్థుల్లో చదువుతో పాటు నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు వివిధ కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ కళాశాలలు, యూనివర్శిటీల్లో చదివే విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా తమ విద్యార్థులు చదువులో ప్రతిభ చూపుతున్నారని చెప్పారు. తమ విద్యార్థి గరికపాటి బిందుమాధవ్ సివిల్ సర్వీసెస్‌లో 172వ ర్యాంకు సాధించడమే ఇందుకు నిదర్శనమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 212 అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శి కేంద్రాలున్నాయని, వీటి పరిధిలో సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు చెప్పారు. డిగ్రీతో పాటు ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ వంటి కోర్సులతో పాటు ఎంబీఏ, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈడీ, బీఈడీ స్పెషల్ (దివ్యాంగులు) తదితర కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని వివరించారు. కడప జిల్లాలో రాజంపేటతో పాటు కడప కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాల, కేంద్ర కారాగారం, ఆర్ట్స్ కళాశాల, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు, రాయచోటి, పోరుమామిళ్ల, బద్వేలు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగులో కేంద్రాలున్నాయని, వీటి పరిధిలో సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు వివరించారు.



ఎల్.విజయకృష్ణారెడ్డి

24 వరకు ప్రవేశ గడువు.. : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీలోని అన్ని కోర్సుల్లో చేరడానికి ప్రవేశాల గడువు ఈనెల 24తో ముగుస్తుందని ఎల్వీకే తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చునని, ప్రవేశం పొందాలనుకునే వారు తమ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పంపాల్సి ఉంటుందన్నారు. www.braouonline.in పోర్టల్‌ను ఓపెన్ చేసి అడ్మిషన్ లింక్‌ను ఓపెన్ చేస్తే దరఖాస్తు వస్తుందని, దాన్ని భర్తీ చేసి అవసరమైన పత్రాలను, ఫొటోపే జతచేసి అప్‌లోడ్ చేయాలని సూచించారు. అప్‌లోడ్ చేసిన దరఖాస్తును ప్రింట్ తీసుకొని ఒరిజనల్ పత్రాలతో మీరు ఎంచుకున్న కేంద్రాలకు వెళితే పరిశీలించి ధ్రువీకరిస్తారని ఆయన వివరించారు.

కలెక్టరేట్‌లో సూచిక బోర్డులు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సూచికలు

స్పందనకు వందనం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు జిల్లా పాలనాధికారులు స్పందించారు. కొత్త కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సూచిక బోర్డులు ఏర్పాటు చేసి జనాలకు ఉపశమనం కల్గించారు. కడప కలెక్టర్ కార్యాలయంలో ఉన్న మూడు విభాగాల్లోని కార్యాలయాలను జనాలు గుర్తించలేకపోతున్న విషయాన్ని ఈనాడులో పలు కథనాలు ప్రచురించగా కలెక్టర్ స్పందించి తక్షణమే సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీ, డీ, ఓ బ్లాకులను సూచిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇది కాసింత ఉపశమనమేనని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

అత్యవసర సేవలకు 108

రైల్వేకోడూరు

మట్టి ప్రతిమలే ప్రకృతికి మేలు



గోడపత్రాలను విడుదల చేస్తున్న జైభారత్ ట్రస్టు సభ్యులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ప్లాస్టర్‌ఆఫ్‌ప్యారిస్‌తో చేసిన రంగుల విగ్రహాల కంటే మట్టి విగ్రహాలను ఉపయోగించడం, పూజించడమే ప్రకృతికి, పర్యావరణానికి మంచిదని జై భారత్ ట్రస్టు సభ్యులు ఈశ్వర్, సందీప్, భువనేశ్వర్, రామకృష్ణ, మనోహర్, ఓబులేశు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించడంకోసం ఆదివారం స్థానిక మహాత్మాగాంధీ విగ్రహంవద్ద కరపత్రాలను విడుదలచేశారు. పట్టణ పరిధిలోని ప్రజలందరికి మట్టి విగ్రహాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తామన్నారు.

ఆరుగురు ఎర్రచందనం కూలీల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, కూలీలతో సీఐ, ఎస్ఐలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని తుమ్మల బైలు ప్రాంతంలో ఆరుగురు ఎర్రచందనం కూలీలను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఐదు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని సీఐ మురళీనాయక్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్పీ రాజేంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐలు చెన్నకేశవ, మహేష్ చాకచక్యంతో మండల పరిధిలోని తుమ్మల బైలు ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న మల్లికార్జున, శివరాం, రెడ్డియ్య, ఈశ్వరయ్య, హరికృష్ణ, రవినాయక్‌లను పట్టుకున్నారన్నారు. వీరే కాకుండా మరో 15 మంది ఉన్నారని తమ విచారణలో తేలిందన్నారు. వీరు తిరుపతి, చైన్నకు చెందిన వారని తెలిసింది. వీరి కోసమై గాలింపు చర్యలు చేపట్టామన్నారు. మల్లికార్జున వీరికి మేట్‌గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. రవినాయక్ గతంలో అటవీశాఖలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేసేవాడన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో మార్కెట్ ధరలు (నిన్నటివి)



రకాలు	కిలో (రూ)
బెండకాయలు	40
మటిక్కాయలు	50
వంకాయలు	40
బీట్‌రూట్	40
బంగాళదుంప	30
కాకర	50
టమోటాలు	40
పచ్చిమిరప	60
క్యాలీఫ్లవర్	40
అల్లం	80
చిక్కుడు	70
క్యారెట్	60
ఎర్రగడ్డలు	40
క్యాబేజీ	30
మునక్కాయలు	50
బీన్స్	80
దొండ	40
ముల్లంగి	40

మాంసం ధరలు



	కిలో (రూ)
మటన్	480
చికెన్	140
చికెన్ (స్కిన్‌లెస్)	160
100 గుడ్లు	380
డజను గుడ్లు	50
చేపలు	100

తెరపై ఈనాడు

శ్రీ లక్ష్మీ ప్యారడైజ్ : నక్షత్రం
శ్రీ కృష్ణా : గౌతమ్‌నంద,
లవ : నేనేరాజు నేనేమంత్రి
సిద్ధేశ్వర : జయ జానకీ నాయకా.
ఎఎస్ఆర్ : లై

కశ్యప పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఈయేడాదికి సంబంధించి ఏపీ బ్రాహ్మణ సంక్షేమసంస్థ ఆధ్వర్యంలో అందజేసే కశ్యప పింఛన్లకోసం అర్హులైన బ్రాహ్మణ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ నియోజకవర్గ కోఆర్డినేటర్ సి. నరసింహశర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేరుకే ఆదర్శం.. వసతులు శూన్యం

❑ అసంపూర్తిగా భవనాలు
❑ విద్యార్థులకు తప్పని అవస్థలు



అసంపూర్తిగా ఉన్న పైభవనం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : మండల పరిధిలో ఏడు ఆదర్శ పాఠశాలను గుర్తించి అక్కడ అన్ని వసతులు సమకురే విధంగా చేశారు. అయితే బొమ్మవరం ప్రాథమిక పాఠశాల ఆదర్శ పాఠశాలగా మార్చిన అధికారులు వసతులు మర్చిపోయారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ సుమారు 140 మంది విద్యార్థులు ఉన్నారు. అందుకు తగ్గట్లు గదులు లేక చదువులు సక్రమంగా సాగడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్వశిక్షాభియాన్ ద్వారా రూ. 6.50 లక్షలు మంజూరు చేశారు. స్థలం లేకపోవడంతో పాత గదులపై కొత్త భవనం ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించారు. కొద్ది వరకు గోడలు నిర్మించిన గుత్తేదారుడు తర్వాత పాఠశాల ముఖం కూడా చూడలేదు. సుమారు రూ. 3లక్షలు నిధులను బ్యాంక్ ఖాతా నుంచి తీశారు. ఇంకా నిధులు ఉన్నాయి. అయినా పనులు చేయక ఏడాది అవుతోంది. పేరుకే ఆదర్శ పాఠశాలగా ఉంది. అక్కడ వసతులు మాత్రం ఏ విధంగాను లేవు. ఉన్న పాత గదులు వర్షం పడితే నీళ్లు నిలుస్తాయి. ఉన్నతపాఠశాలలో రెండు గదులో ఐదు తరగతులు 140 మంది విద్యార్థులకు బోధన నిర్వహిస్తున్నారు. సాధారణంగా ప్రాథమిక పాఠశాల అంటే 10 నుంచి 50 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉండరు. ఇక్కడ ఆదర్శ ప్రాథమిక పాఠశాల కావడంతో 140 మంది విద్యార్థులు ఉన్నారు. అందుకు సరిపడా గదులు లేవు. ఉన్నత అధికారులు త్వరగా గదులను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఇబ్బందులు ఉండవని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఎంఈవో పద్మజను వివరణ కోరగా ఆ పాఠశాల ఒక గది ఏర్పాటు చేయాలని నిధులు వచ్చాయి. పాఠశాల కమిటీ ఛైర్మన్ పనులు ప్రారంభించారు. మధ్యలో ఆగినట్లు నా దృష్టికి రాలేదు. పాఠశాల ఉపాధ్యాయులు, గుత్తేదారునితో చర్చించి పనులు త్వరగా చేయిస్తాం.



పాఠశాలలో గదులు లేక వరండాలో కూర్చుంటున్న విద్యార్థులు

నంద్యాల ప్రచారంలో కోడూరు నేతలు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం నంద్యాల ఉపఎన్నికల నిమిత్తం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, తెదేపా బాధ్యుడు కస్తూరి విశ్వనాథనాయుడు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు అక్కడే మకాం వేశారు. ఈ ముగ్గురూ రైల్వేకోడూరు ప్రధాన నేతలు. వీరంతా నంద్యాలలోనే ఉంటున్నారు. తెదేపా తరపున బత్యాల, విశ్వనాథనాయుడు - వైకాపా తరపున ఎమ్మెల్యే కొరముట్ల తీరకలేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ తమ పార్టీల తరపున పోటీచేస్తున్న అభ్యర్థులకే ఓట్లు వేయాలంటూ అక్కడి ప్రజలను కోరుతున్నారు.

పండ్ల తోటల పెంపకంలో వేగం



రైతుల పొలంలో గుంతల తవ్వకం పనులు చేస్తున్న కూలీలు



మొక్కలు నాటుతున్న కూలీలు

పెనగలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలో పండ్ల తోటల పెంపకం పనులు వేగంగా జరుగుతున్నాయి. రైతుల పొలాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే పనులు చురుగ్గా జరిగే విధంగా వెలుగు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిరుపేద సన్నకారు రైతులకు ఉచితంగా పండ్ల తోటల పెంచుకోవడానికి అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు రోడ్డుకు ఇరువైపులా 5 కి.మీ. గుంతలు తవ్వి మొక్కలు నాటారు. పది ఎకరాల్లో రైతు పొలాల్లో గుంతలు తవ్వి పండ్ల మొక్కలు నాటించారు. నియోజకవర్గంలోనే ఎక్కువగా పెనగలూరు మండలంలోనే పండ్ల తోటలు పెంచడానికి దరఖాస్తులు తీసుకున్న అధికారులు వాటిని మంజూరు చేయించారు. రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకుని మంజూరు అయిన వారు వెంటనే పనులు ప్రారంభించాలని ఏపీఎమ్ రామ్మోహన్ తెలిపారు. 219 మంది రైతులు పొలాల్లో 483 ఎకరాలలో పండ్ల తోటల పెంపకం పనులు లక్ష్యమని చెప్పారు.

వసతి గృహాలకు రంగులు

❑ దేశనాయకుల చిత్రపటాలతో అలంకరణ
❑ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికి ప్రయత్నం



కేంద్రీయ వసతి గృహ ముఖద్వారం



బాలికల వసతి గృహ ముఖద్వారం

చిట్వేలి, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతి గృహాలంటే అపరిశుభ్రంగా.. వెలసిపోయిన రంగులతో.. పెచ్చులూడిన గోడలతో ఉంటాయనే నమ్మకాన్ని మార్చుకోవలసిన సమయం వచ్చేసింది. జిల్లాలోని వసతి గృహాలన్నింటికీ ఏళ్ల తరబడి వెల్ల వేయకపోవడంతో మాసిపోయాయి. పరిసరాల శుభ్రత అంతంతే. జిల్లాలోని వసతి గృహాలన్నింటికీ రంగులు వేయమని, పరిశుభ్రంగా ఉంచుకోమని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో చిట్వేలి మండలంలోని వసతి గృహాలన్నీ కొత్త సొబగులు సంతరించుకున్నాయి. కొత్త రంగులతో వెలిగిపోతున్నాయి. దేశనాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, సమాజ సేవికుల చిత్రపటాలను వసతి గృహాల గోడలకు వేయించి విద్యార్థులలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేయడం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. వసతి గృహ విద్యార్థులు కూడా మంచి పరిశుభ్రమైన పరిసరాలు ఏర్పడ్డాయని సంతోషపడుతున్నారు.

కలుషిత జలం.. ప్రయాణికులకు శాపం



పాచిపట్టిన కుళాయి వద్ద నీరు తాగుతున్న ప్రయాణికురాలు

రైల్వేకోడూరు గ్రామీణ, న్యూస్‌టుడే : రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛమైన తాగునీరు దొరకక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టేషన్‌కు వచ్చేవారు ప్రతి ఒక్కరూ ధనవంతులై ఉండరు.. ఎందుకంటే డబ్బులు పెట్టి నీటిసీసాలు కొనుక్కునే స్థోమత అందరికీ ఉండదు. ఈ ప్రాంతం బీ సెంటర్ కావడంతో ఇక్కడ నుంచి ఎక్కువగా మధ్యతరగతి, పేదవారే రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రైల్వేస్టేషన్‌లో తాగునీటికోసం ఏర్పాటుచేసిన కుళాయి వద్ద పాచిపట్టి అపరిశుభ్రంగా మారింది. విధిలేక అక్కడే ప్రయాణికులు నీటిని తాగాల్సి వస్తోంది. ఫలితంగా పలురోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఇకనైనా రైల్వేఅధికారులు స్పందించి తాగునీటి కుళాయిలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉందని పలువురు కోరుతున్నారు.

సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు శ్రమించాలి



సాక్షరభారత్ పరీక్షలు రాస్తున్న వయోజనులు

రంగంపల్లె(పుల్లంపేట), న్యూస్‌టుడే: జిల్లా సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు మండల సాక్షరభారత్ సమన్వయకర్తలు శ్రమించాలని డీసీవో పెద్దన్న పేర్కొన్నారు. ఆదివారం మండలంలో జరుగుతున్న వయోజన విద్య పరీక్షలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వయోజనుడు వేలుముద్రకు స్వస్తి చెప్పి చేవ్రాలు చేసే స్థాయికి ఎదగాలన్నారు. ప్రయాణం సమయంలో బస్సుపై ఉన్న ఊర్ల పేర్లు చదివేలా చూడాలన్నారు. సంపూర్ణ అక్షరాస్యత పంచాయితీలుగా తీర్చిదిద్దాలన్నారు. వేలు ముద్ర వేసి పింఛన్ తీసుకొనే వారు లేకుండా చూడాలన్నారు. ఎంసీవో రామచంద్ర మాట్లాడుతూ మండలంలో 698 మంది వయోజనులు ఉండగా అందులో 695 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పర్యవేక్షకుడు శ్రీరాములరెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు

విగ్రహ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండల పరిధిలో త్వరలో జరగబోయే వినాయక చవితి ఉత్సవాల్లో అనుమతి లేకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ చెన్నకేశవ పేర్కొన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ విగ్రహాలను ఎన్ని రోజులు రోజులు ఏర్పాటు చేస్తున్నారో దరఖాస్తులో పొందుపరచాలన్నారు.

రాయితీ రుణాల ఎంపికల్లో రిక్తహస్తం

అర్హులకు న్యాయం జరిగేనా

పెనగలూరు,న్యూస్‌టుడే: మండల పరిధిలో రాయితీ రుణాల ఎంపికలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని నిరుద్యోగ యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. గత నెలలో అంతర్జాలంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో కమిటీ సభ్యులు, ఎంపీడీవో, బ్యాంకు అధికారులు ఈ నెల 10న ముఖాముఖి నిర్వహించారు. ప్రతి ఒక్కరితో అధికారులు, బ్యాంకు సిబ్బంది, కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈ ప్రక్రియ జరిగి దాదాపు 10 రోజులు పూర్తయింది. అప్పటి నుంచి ఎంపికలో కమిటీ సభ్యులు, అధికారులు తీవ్ర జాప్యం వహిస్తున్నారు. ప్రధాన రాజకీయ గ్రహణం పట్టుకోవడమే. నియోజకవర్గస్థాయి నాయకుల అనుచరులు చెప్పినట్టు చేయాలని గట్టిగా చెబుతుండటంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. కొందరు రాజకీయ నాయకులు రాయితీ రుణాలు తమ వారికే కావాలని పట్టుపడుతుండటంతో వాస్తవ నిరుద్యోగులకు అన్యాయం జరగనుంది. వాస్తవ అర్హులకు ఈ సారి న్యాయం జరిగేలా కనపడటం లేదు. చాలా మంది గత మూడు సంవత్సరాలుగా ముఖాముఖికి హాజరైనవారే ఉన్నారు. రాజకీయ నాయకులు వారికి అనుకూలమైన వారికి ఇవ్వాలని చెబుతుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎంపికలో తమ పేరు వచ్చే విధంగా చూడాలని నియోజకవర్గ స్థాయి నాయకుల నుంచి అధికారులకు చరవాణిలో మాట్లాడిస్తున్నారు. రాజకీయ నాయకులు జోక్యం చేసుకుంటుండటంతో లబ్ధిదారుల ఎంపిక మరింత సమయం పట్టే అవకాశం కన్పిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన సమయంలోపు ఎంపిక వివరాలు ఉన్నతాధికారులకు పంపకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణం మంజూరు అయినప్పటికి బ్యాంకు అధికారులు ఇంత వరకు ఒక్కరికీ రుణాలు ఇవ్వలేదు. కమిటీ సభ్యులు ఎంపిక చేసిన లబ్ధిదారులను బ్యాంకు అధికారులు ఎంపిక చేయకపోవడంతో ఈ సమస్య నెలకొంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పేరుకే ఈ నెల 10న అభ్యర్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ ముఖాముఖిలోనే కమిటీ సభ్యులు, బ్యాంకు, కమిటీ అధికారులు ఎంపిక చేయాల్సింది పోయి ఆ రోజు నామమాత్రంగానే నిర్వహించారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పుడు కమిటీ సభ్యులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో కూర్చొనేది ఎప్పుడు ఎంపికలు జరిగేదెప్పుడో అని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా రాజకీయాలతో పని లేకుండా వాస్తవ లబ్ధిదారులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిరుద్యోగులు చెబుతున్నారు.



ఈ నెల 10న రాయితీ రుణాలకు ముఖాముఖి(దాచిన చిత్రం)

మూడేళ్లుగా దరఖాస్తు



రుణం కోసం మూడేళ్లుగా దరఖాస్తు చేస్తున్నాను. నా కంటే వెనక దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు మంజూరు చేశారు. దళిత రుణాల లోనూ మా పంచాయతీకి ఇన్ని, నాకు ఇన్ని అని పంచుకుంటున్నారు. వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ఎంపిక చేస్తే బాగుంటుంది. ప్రభుత్వ రుణాలు ప్రతి ఒక్కరికి అందాలి. రాజకీయ నాయకుల జోక్యం చేసుకోవడంతో వాస్తవ లబ్ధిదారులకు నష్టం చేకూరుతుంది.

-తిప్పన తిరుపయ్య, ఎస్సీ నల్లపురెడ్డిపల్లి

ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలి



రుణాల కోసం మూడేళ్లుగా దరఖాస్తు చేస్తున్నా.. ముఖాముఖికి హాజరయ్యే వారికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏళ్లతరబడి రాయితీ రుణాల ఎంపికకు హాజరవుతున్నాను. నాకు ఇంత వరకు రుణం మంజూరు చేయలేదు. లక్ష్యానికి అనుగుణంగా ఎంపికలు జరగడం లేదు. అధికారులు పారదర్శత పాటించాలి. ప్రజల్లో నమ్మకం కలిగించాలి.

-మంచా నరసింహులు, కాపు కొండూరు

ఎంపికలు పూర్తి చేస్తున్నాం

రాయితీ రుణాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. ముఖాముఖి ప్రక్రియ పూర్తి చేశాం. కమిటీ సభ్యుల సంతకాలు తీసుకుని బ్యాంకుకు పంపుతాం. ఎంపికలో పారదర్శక పాటిస్తున్నాం. అర్హులకు తప్పక రుణాలు మంజూరవుతాయి.

-ప్రతాప్, ఎంపీడీవో పెనగలూరు

ఘనంగా ఉరుసు వేడుకలు

ఓబిలి(పెనగలూరు),న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓబిలిలో ఉరుసు వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు పాపాబీ దర్గాను సందర్శించుకున్నారు. దర్గాలోని సమాధికి ప్రతి ఒక్కరూ తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. కుల మతాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఇక్కడికి వస్తారని పెద్దలు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం జరిగే ఉరుసు వేడుకల్లో పెద్ద ఎత్తున ప్రజలు, భక్తులు పాల్గొంటారు. ఆదివారం రాత్రి మత పెద్దలు నెల్లూరు వారు పాతెహా చదివి వినిపించారు. పక్కీర్లు తమ గానాలతో గ్రామంలో గంధాన్ని ఊరేగింపు నిర్వహించారు. పలువురు పులచాదర్‌ను సమర్పించారు. వేడుకల్లో ఎంపీపీ ఇర్షాద్ బేగం, హబీబ్, అమీర్, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.



పాపాబీ దర్గాలో ఉరుసు కార్యక్రమాలు

మిలియన్‌మార్చ్ విజయవంతానికి పిలుపు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: 2004 సెప్టెంబరు 1 తరువాత నియమితులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి నిర్బంధంగా అమలుచేస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్(సీపీఎస్) విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ సెప్టెంబరు 1న విజయవాడలో మిలియన్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ నాయకులు రాజారత్నం, లక్ష్మీనారాయణ, హరిహరన్ పేర్కొన్నారు. ఈమేరకు స్థానిక ఎస్టీవో కార్యాలయంలో ఆదివారం గోడపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయ సంఘాల నాయకులు పణీంద్రప్రసాద్ యాదవ్, సంపత్‌కుమార్, కిరణ్‌కుమార్, నాగరాజు, అశోక్ కుమార్, మస్తాన్‌బాషా పాల్గొన్నారు.



గోడపత్రాలు విడుదలచేస్తున్న ఉపాధ్యాయులు

స్వచ్ఛభారతం.. సుదూర స్వప్నం

పారిశుద్ధ్యం పట్టించుకోరా ?



పెనగలూరు మీ సేవ రోడ్డు వద్ద దుస్థితి



వెలగచర్ల పాఠశాల రోడ్డుకు ఇరువైపులా అపరిశుభ్రతే

పెనగలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలో స్వచ్ఛభారత్ ఆశయం పడకేసింది. పారిశుద్ధ్య పనులపై పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పెనగలూరు మీ సేవ రోడ్డులో వర్షం పడితే ఆ నీరు ఎటు వెళ్లడానికి వీలు లేకుండా అలాగే రోడ్డుపై నిలిచిపోతున్నాయి. ఈ సమస్య సంవత్సరాల తరబడి ఉన్నా అధికారులుగాని, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రోడ్డు వేసినా నీళ్లు ఎక్కువ ఉండటంతో ప్రజలు తిరగడం లేదు. ఫలితంగా ఆ నీటిలో లార్వా చేరి దోమల బెడద పెరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోమంతరాజపురం పంచాయతీ బెస్తపల్లి రోడ్డు నుంచి జెట్టివారిపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీటితో దోమల బెడద పెరిగి జ్వరాల బాధితులు పెరుగుతున్నాయన్నారు. వీటన్నింటికి ప్రధాన కారణం అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడమేనని స్పష్టంగా తెలుస్తోంది. పక్కనే ఉన్న కాలువ ఆక్రమణను తొలగించి నీళ్లు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ వైపే చూడటం లేదు. వెలగచర్ల ప్రాథమిక పాఠశాల రోడ్డుకు ఇరువైపులా ప్రజలు మలవిసర్జన చేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓబిలి పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేయడమే లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మొత్తం మీద పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ రాజ్ చట్టాన్ని గ్రామాలలో అమలుపరచడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు చట్టాలు అమలు చేస్తేనే పారిశుద్ధ్యం అదుపులోకి వస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. పంచాయతీల నిర్లక్ష్యంతో అపరిశుభ్రత ఏర్పడి దోమల ప్రభావంతో పలు రకాల వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



బెస్తపల్లి నుంచి జెట్టివారిపల్లి రోడ్డుపై నిలిచిన నీరు

రంగనాయకులపేట బాగుపడేదెప్పుడు?



ఎండకాస్తే ఇలా..

పంచాయతీ నిధులు, ఆర్థిక ప్రణాళికాసంఘం నిధులు సుమారు రూ. 2 కోట్లు వెచ్చించి పట్టణంలోని పలుప్రాంతాల్లో సిమెంటురోడ్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థలను నిర్మిస్తున్నారు. కానీ పట్టణంలోని మిగతా ప్రాంతాలకంటే అత్యంత దుర్భర పరిస్థితులను చవిచూస్తున్న రంగనాయకులపేటను మాత్రం పాలకులు విస్మరిస్తున్నారు. ఇరుకైన వీధులు, సామర్థ్యంలేని మురుగునీటి వ్యవస్థలతో ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న కార్యాలయాలపై అంతస్తులు నిర్మించడానికి ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తున్న నేతలు ఇలాంటి ప్రాంతాల అభివృద్ధి కోసంకూడా కృషిచేస్తే మంచిదని రంగనాయకులపేట ప్రజలు కోరుకుంటున్నారు. - రైల్వేకోడూరు, న్యూస్‌టుడే



వానొస్తే ఇలా..

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

రాఘవరాజుపురం(రైల్వేకోడూరు గ్రామీణ), న్యూస్‌టుడే : మండల పరిధిలోని రాఘవరాజుపురం పంచాయతీలోని ముప్పేర్రు సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. మంగంపేట నుంచి రైల్వేకోడూరుకు ప్రయాణికులతో వస్తున్న ఆటో ముప్పేర్రు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కన అదుపు తప్పి బోల్తాపడిపోయిందన్నారు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలయినట్లు వారు తెలిపారు. గాయపడిన వారిని కోడూరులోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు.

ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన రావాలి

రోడ్డుభద్రతపై లఘు చిత్రం ☆ విడుదల చేసిన ఎస్పీ బాబూజీ



మాట్లాడుతున్న ఎస్పీ బాబూజీ, పక్కన తెదేపా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: సమాజంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో చాలా వరకు అవగాహన లేకపోవడం వలనే జరుగుతున్నాయని జిల్లా పోలీసు అధికారి బాబూజీ అన్నారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన 'నేను తప్పు చేశా' అనే లఘు చిత్రాన్ని ఆదివారం రాత్రి ఎస్పీ స్థానిక కళాక్షేత్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుతం అత్యధిక మరణాలు అనారోగ్యాల వల్లానో, టెర్రరిస్టుల దాడుల వల్లనో, హత్యల వల్లానో జరగడం లేదన్నారు. కేవలం రోడ్డు ప్రమాదాల వల్లానే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇలాంటి లఘు చిత్రాన్ని రూపొందించిన హేమారెడ్డి, శివారెడ్డిలు అభినందనీయులన్నారు. చిన్న తప్పు జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తుందనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలపై సమాజంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు అప్రమత్తంగా వాహనం నడపాలన్నారు. అనంతరం ఎస్పీని సన్మానించారు. కార్యక్రమంలో కడప డీఎస్పీ మాసూంబాషా, సీఐలు సత్యనారాయణ, రామకృష్ణ, భాస్కర్‌రెడ్డితో పాటు ఎస్సైలున్నారు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేడు పవిత్రోత్సవాలకు అంకురార్పణ

మూడు రోజులు శాస్త్రోక్తంగా హోమాలు ★ 24న ఏకశిలానగరిలో గ్రామోత్సవం ★ తితిదే ప్రత్యేక ఏర్పాట్లు



భక్తులకు దర్శనమిచ్చే సీతారామలక్ష్మణ మూలమూర్తులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఏకశిలానగరిలో కొలువైన కోదండ రామాలయాన్ని పవిత్రోత్సవాలకు చక్కగా ముస్తాబు చేశారు. ఏడాది కాలంలో జరిగిన తప్పిదాలు, దోష నివారణకు శాస్త్రోక్తంగా హోమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు ఉత్సవాలకు అంకురార్పణ చేస్తామని పర్యవేక్షకుడు కేవీ లక్ష్మీనాగరాజు తెలిపారు. నేడు పరిషత్ ప్రార్థన, సభా అనుజ్ఞ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, దీక్షాధారాణ, పవిత్ర పుట్ట మన్ను సమర్పణ, వాస్తు పూజ, వాస్తు హోమం, అంకురార్పణ పూజలు జరుగుతాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే పవిత్రోత్సవాల నిర్వహణకు మూడు హోమ గుండాలను నిర్మించారు. జగభిరాముడి సన్నిధికి విచ్చేసే భక్తుల కోసం ప్రత్యేకంగా చలువ పందిరి వేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తున్నారు. అన్నమయ్య సంకీర్తనలు, హరికథలు, వేదా పారాయణం కార్యక్రమాలు జరుగుతాయి. 22న పవిత్ర దేవత ప్రతిష్ఠ హోమాలు, 23న పవిత్రాల సమర్పణ, 24న పవిత్ర విసర్జన, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ పూజలు చేయనున్నారు. గురువారం ఒంటిమిట్టలో కోదండరాముడి గ్రామోత్సవం జరుగుతందని తితిదే అధికారులు తెలిపారు.



హోమాలు నిర్వహణకు ఏర్పాట్లు



భక్తుల కోసం చలువ పందిరి

ప్రచారం కరవు..: ఒంటిమిట్ట కోదండ రామాలయం తితిదేలోకి విలీనం చేసిన తర్వాత రఘురాముడి సన్నిధిలో జరిగే కార్యక్రమాలు, పూజలు, ఇక్కడి కొచ్చే ప్రముఖుల సమాచారం ఇచ్చే దిక్కులేదు. అడిగితేగానీ చెప్పే పరిస్థితి లేదు. ఇటీవల కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ దృష్టికి స్థానికులు ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇకమీదట ప్రచారంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. స్థానిక అధికారులు మాత్రం దీన్ని అమలు చేయడం లేదు. పవిత్రోత్సవాల ప్రచారంపై నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అట్టహాసంగా ముగిసిన బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు

బాలికల విభాగంలో విజేతగా నిలిచిన కడప జిల్లా జట్టు ❒ బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు జయకేతనం





▲ట్రోఫీ అందుకుంటున్న కడప జిల్లా బాలికల జట్టు..మాట్లాడుతున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉమాశంకర్..

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక పీఆర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 18న ప్రారంభమైన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు అట్టహాసంగా ముగిశాయి. బాలుర విభాగంలో కృష్ణా జట్టు విజేతగా నిలవగా, బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. సెమీ ఫైనల్ నుంచి మ్యాచ్‌లన్నీ హోరాహోరీగా సాగాయి. ముగింపు కార్యక్రమానికి కడప జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పరిశీలకుడు ఎంఎస్ ఉమాశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బేస్‌బాల్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందన్నారు. జమ్మలమడుగులో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించినందుకు కడప జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కోచ్‌లను సన్మానించారు. కార్యక్రమం చివరలో బేస్‌బాల్ జాతీయస్థాయిలో ఆడే జట్టును ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యదర్శి ఎం.వి. సత్యప్రసాద్, ఉపాధ్యక్షుడు సజ్జనరావు, కోశాధికారి ఎస్.సాంబశివరావు, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నవీన్‌కుమార్, జిల్లా సంఘం కార్యదర్శి ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న కృష్ణా జిల్లా బాలుర జట్టు

సెలంబమ్ జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక



సెలంబమ్ క్రీడా జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులతో క్రీడాధికారులు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: కడప నగరంలోని స్థానిక శంకరాపురంలో గల మదర్‌ఇండియా స్కూల్‌లో ఆదివారం ఉదయం జిల్లా ఎంపికలను నిర్వహించినట్లు సెలంబమ్ క్రీడా సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి బాబు తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఒలింపిక్ అడహక్ కమిటీ ఛైర్మన్ తోట కృష్ణ, అసోసియేట్ ఛైర్మన్ వై.శివరామకృష్ణమూర్తి, కార్యదర్శి శ్రీకాంత్, దామోదర్, మస్తాన్, రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ ఎంపికల్లో సబ్ జూనియర్ విభాగంలో లోక నితిన్, ప్రనుష్, రెడ్డి కళ్యాణ్, మనికుమార్, ఫాజిల్ భాషా, హేమంత్ కుమార్, కార్తికేయ, పి.మహేష్‌బాబు, మన్సూర్, జూనియర్ విభాగంలో ఎం.సాయియోగేష్, జి.దినేష్, గౌతమ్, శ్రీరామ్, శివమణి, రవితేజ, బుతిక్, ఉదయ్, ప్రశాంత్, జకరయ, అలాగే సీనియర్స్ విభాగంలో జగన్‌మోహన్‌రెడ్డి, నూర్ మహమద్, విష్ణువర్ధన్, ఆదిల్, ప్రసాద్, మహేంద్ర, మహేష్, గోపిచంద్, సాగన్నలను ఎంపిక చేశారు. ఈ పోటీలకు పర్యవేక్షకులుగా వెంకటేష్, రెఫరీలుగా మహేష్ బాబు, మణికుమార్ పాల్గొన్నారు.

రుణాలు చెల్లించకపోతే చర్యలు



సంఘ సభ్యురాలికి తనఖా పత్రాన్ని వెనక్కి ఇచ్చేస్తున్న ఏపీ హౌసింగ్ ప్రాంతీయ అధికారి గురప్ప

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ అవసరం కోసం ఆంధ్రప్రదేశ్ హౌస్‌ఫెడ్‌లో రుణం పొందిన సభ్యులు తీసుకున్న రుణం తిరిగి చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని ఏపీ హౌస్‌ఫెడ్ ప్రాంతీయ అధికారి గురప్ప అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సభ్యుడు, సభ్యురాలు పొందిన రుణాన్ని నిర్ణీత వ్యవధిలో వాయిదాల ప్రకారం చెల్లించాలన్నారు. అలా చెల్లిస్తే అపరాధ రుసుం పడదన్నారు. తీసుకున్న రుణాన్ని హైదరాబాద్ ఏపీ హౌస్‌ఫెడ్‌కు చెల్లించిన వెంటనే తనఖా పెట్టిన పత్రాలను ఇచ్చేస్తారన్నారు. వాయిదా మీరిన రుణాల వసూలుకు సహకార అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారన్నారు. చెల్లించకపోతే చర, స్థిరాస్తులను జప్తు చేస్తారన్నారు. అప్పును ఏపీ హౌస్‌ఫెడ్ హైదరాబాద్ భారతీయ స్టేట్ బ్యాంక్ ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా నేరుగా జమ చేయవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 31 సంఘాల నుంచి ఈ ఏడాది జులై వరకు రూ.350.27 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి తనఖా పత్రాలను ఆయన అందచేశారు. సమావేశంలో అధికారులు, సిబ్బంది, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తిరిగి పాగా.. అవినీతి పక్కా..

(మొదటిపేజీ తరువాయి) పనులు ముగించుకుని వెళ్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా కార్యాలయం వెనుక ఉన్న కిటికీల వద్దకు వచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కొందరు వాహనాదారులు ఇప్పటికీ దళారులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయం మొదలుకుని ఏ కార్యాలయానికి వెళ్లినా ఇదే పరిస్థితి..

జిల్లాలో రవాణాశాఖ కార్యాలయాలంటేనే దళారుల అడ్డాలుగా పేరొందాయి. వారు లేనిదే కార్యాలయంలో ఏ ఒక్క పని జరగదనేది నగ్న సత్యం. కానీ కొంత కాలం పాటు దళారులు, సహాయకుల బెడద లేకుండా చేశారు. ప్రజలు కూడా సంతోషించారు. కానీ తర్వాత పరిస్థితి మారిపోయింది. తిరిగి సహాయకులు కార్యాలయంలోకి వెళ్తున్నారు. వారికి కావాల్సిన పనులు చేయించుకుంటున్నారు. వాహనదారుల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలుచేసి పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వాహనాల బదిలీలు, పర్మిట్లు కేటాయించే పనుల్లో దళారుల హస్తం ఉందనే విషయం స్పష్టమవుతోంది. వాహనదారుడు వెళ్తే పనులు జరగడం లేదని, సహాయకుని పంపిస్తే పనులు త్వరితగతిన అయిపోతాయనే నమ్మకం ప్రజల్లో నాటుకుని పోయింది. సీసీ కెమెరాలున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఉన్నతాధికారి లేని సమయంలో సహాయకులు, దళారులు కార్యాలయంలోకి వస్తున్నారు. లేదంటే కార్యాలయం వెనుక వైపు కిటికీల వద్దకు వెళ్లి పనులు చేయించుకుంటున్నారు. కార్యాలయ సమయం అయిపోయిన తరువాత వీరు పనులు చేయించుకుంటున్నారనే వాదనలు కూడా లేకపోలేదు. దళారులు, వారి సహాయకులను కార్యాలయంలోకి రాకుండా చేసేందుకు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ వారు కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు. పేరుమోసిన కొంతమంది సహాయకులు ఇప్పటికీ రవాణాశాఖ కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారు. వారు తీసుకెళ్లే ప్రతి ఒక్క పని త్వరగా జరుగుతోందని కూడా చెప్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో ఏడు భారీ డ్రైవింగ్ పాఠశాలలు, 34 సాధారణ డ్రైవింగ్ బడులున్నాయి. కానీ చాలా పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పాఠశాల ప్రారంభం రోజు అధికారుల నిబంధనల మేరకు అన్ని వస్తువులను ఏర్పాటుచేస్తారు. తరువాత వెళ్తే అక్కడ ఉండాల్సిన కనీస వసతులు కూడా లేవు. జిల్లాలోని కొన్ని పాఠశాలలకు అసలు తరగతి గదులు లేవు. కేవలం ఒకే ఒక గదిని అద్దెకు తీసుకుని అభ్యర్థులకు డ్రైవింగ్ నేర్పిస్తుంటారు. క్షేత్రస్థాయిలో డ్రైవింగ్ బాగుంటే ఎలాంటి ప్రమాదాలు జరగవు. కొన్ని పాఠశాలల్లో అర్హతలు లేని వారు శిక్షణ ఇస్తున్నారు. అధికారులు ఒక్కసారి జిల్లాలోని డ్రైవింగ్ పాఠశాలలపై ప్రత్యేక నిఘా పెడితే లోటుపాట్లు తెలుస్తాయి. డ్రైవింగ్ నేర్పించే వాహనాలు అధ్వానంగా ఉన్నాయి. అయినా వాటితోనే నిర్వాహకులు డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు.

నకిలీ ఆధార్‌కార్డులు

గతంలో రవాణాశాఖలో నకిలీ ఆధార్‌కార్డులు పుట్టుకొచ్చాయి. కొద్దిరోజులు అధికారులు వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో తిరిగి సంబంధితులు అసలు ఆధార్‌కార్డులు తీసుకొస్తున్నారు. ఇప్పుడు మళ్లీ నకిలీ ఆధార్ కార్డులు బయట పడుతున్నాయి. ముఖ్యంగా వాహనాల బదిలీల విషయంలో ఆధార్‌కార్డులు చాలా అవసరం. వాహనం అమ్మేవ్యక్తి, కొనే వ్యక్తి ఇద్దరూ రావాలి. కానీ వాహనం అమ్మేవ్యక్తి వేరే చోట ఉంటే అతని ఆధార్‌కార్డుపై వేరే వ్యక్తి ఫొటో పెట్టి ఓసారి ల్యామినేషన్ చేస్తే ఇతనే వాహనదారుడంటూ అధికారులను నమ్మిస్తున్నారు. ఎవరూ గుర్తుపట్టలేని విధంగా చేస్తున్నారు. అలాగే టీసీలు కూడా నకిలీలు వస్తున్నాయి. అధికారులు క్షుణ్ణంగా తనిఖీచేస్తే ఇవన్నీ బయటపడతాయి.

ప్రత్యేక గదుల ఏర్పాటు

జిల్లా రవాణాశాఖ కార్యాలయం వద్ద మళ్లీ దళారులు, సహాయకులు గదులను ఏర్పాటు చేసుకుని అక్కడ తమ పనులు సాగిస్తున్నారని సమాచారం. గతంలో అధికారులు కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఏ ఒక్క గదిని ఉంచేవారు కాదు. ఇప్పుడు తిరిగి చిన్న చిన్న గదులను అద్దెకు తీసుకుని కొందరు పనులు చక్కబెడుతున్నారు. ఎవరైనా వాహనదారులు వస్తే వారికి సంబంధించి పత్రాలను భర్తీచేయడం ఫలానా అధికారి వద్దకు వెళ్తే పనులు పూర్తిచేస్తారని చెప్పడం వంటివి జరుగుతున్నాయి. భర్తీచేసే పత్రాలు కూడా సక్రమంగా చేయడం లేదు. అవి కూడా తప్పులు చేస్తుండడంతో తిరిగి అధికారులు వెనక్కి పంపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల కన్నా ఎక్కువ మొత్తంలో దళారులు, సహాయకులు డబ్బు వసూలుచేస్తున్నారు.

తప్పులతడకగా రిజిస్ట్రేషన్లు

ఎక్కడైతే వాహనం కొనుగోలు చేశారో అక్కడే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ చేసే ముందు అధికారులు జిల్లాలోని షోరూంల్లో పనిచేస్తున్న వారందరికీ వాహన రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పించారు. కానీ ఇప్పటికీ చాలా షోరూముల వారు రిజిస్ట్రేషన్ల పత్రాలను సక్రమంగా భర్తీచేయడం లేదు. తప్పుల తడకగా భర్తీచేసి రవాణాశాఖ కార్యాలయాలకు పంపిస్తున్నారు. అధికారులు పరిశీలిస్తే తప్పులు ఉండడంతో తిరిగి వాటిని వెనక్కి పంపిస్తున్నారు. ఇలా చాలా వాటిని వెనక్కి పంపించారు. దీంతో ఒకే రోజులో నంబరు రావడం లేదు. నంబరు కోసం వేచి చూడాల్సి వస్తోంది.

పోలీసులకు అప్పగిస్తున్నాం




రవాణాశాఖ కార్యాలయంలోకి దళారులు, వారి సహాయకులు వస్తే నేరుగా వారిని పట్టుకుని పోలీసులకు అప్పగిస్తున్నాం. గతంలో చాలా మంది విషయంలో ఇలాగే చేశాం. ఇప్పుడు కూడా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. డ్రైవింగ్ పాఠశాలల్లో అన్ని వసతులుంటేనే అనుమతులు ఇస్తున్నాం. రవాణాశాఖ కార్యాలయం వద్ద దళారులు, సహాయకులు గదులు ఏర్పాటు చేసుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనదారులు నేరుగా అధికారులను కలిసి పనులు చేయించుకోవాలి. దళారులను సంప్రదిస్తే పనులు జరగవు. నకిలీ ఆధార్‌కార్డుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. షోరూముల నిర్వాహకులకు మరోసారి అవగాహన కల్పించి సక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసేవిధంగా చూస్తాం.

- బసిరెడ్డి, డీటీసీ, కడప.

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రం: కాంగ్రెస్

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేందుకు రకరకాల కారణాలు చెబుతోందని హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ము-కశ్మీర్‌లకు ప్రత్యేక హోదా కింద లభించే పన్నుల రాయతీలను పదేళ్ల పాటు పొడిగించడం చూస్తే రాష్ట్రంపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని వ్యాఖ్యానించారు. ఏపీకి ప్రత్యేక హోదా ప్రాణమని శాసనసభలో తీర్మానం చేసి ఓటుకు నోటుకు దెబ్బకు భయపడి ప్రత్యేక ప్యాకేజీతో సరిపెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కేసులతో ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి మోదీ ముందు సాగిలపడ్డాడన్నారు. తమ పార్టీ అలుపెరగకుండా విభజన అంశంలోని ప్రత్యేక హోదా సాధించడానికి పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో పీసీసీ జనరల్ సెక్రటరీ సత్తార్, జాయింట్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ చిత్రంలో పార్టీ నాయకులు

ఆశల అరటికి రెక్కలొచ్చాయ్..!

(మొదటిపేజీ తరువాయి) వ్యక్తంచేస్తున్నారు. తమ అప్పులు తీరిపోతాయని భావిస్తున్నారు.

ఎందుకిలా..?: ప్రధాన పండగలు పూర్తయిన తర్వాత అరటి ధరలు పెరగడంతో రైతులు మరింత ధర వస్తుందని విక్రయానికి ముందుకురావడం లేదు. తమిళనాడు, మహారాష్ట్రల్లో అక్కడి రైతులు ఈ ఏడాది ఏప్రిల్, మే మాసాల నడుమ దిగుబడులు చేతికివచ్చేలా పంట సాగుచేశారు. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో అనుకున్న సమయంలో దిగుబడులు చేతికందాయి. అక్కడ ప్రస్తుతం పంట లేదు. మన రాష్ట్రానికి అక్కడి నుంచి దిగుమతి చేసుకునే అవకాశాలు ఎట్టి పరిస్థితుల్లో లేవు. వారే ముందస్తుగా దిగుబడులు తీసుకోవడం మన జిల్లా అరటి రైతులకు కలిసొచ్చింది.

వ్యాపారులతో సందడి : నెల క్రితం టన్ను రూ.10 వేల ధర పలికిన అరటి నేడు రూ.18 వేలకు చేరింది. మరో నాలుగు రోజుల్లో ధర రూ.23 వేలు దాటుతుందని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మొదటి పంట కొనుగోలుకు మాత్రమే వ్యాపారులు అప్పట్లో ప్రాధాన్యమిచ్చేవారు. మొదటి, రెండో పంటల కొనుగోలుకు తేడా టన్ను రూ.5 వేలకు పైగా ఉండేది. మూడో పంట వైపు కన్నెత్తి చూసేవారు కాదు. ప్రస్తుతం మొదటి, రెండు, మూడో పంటలకు కూడా ఒకే ధర చెల్లించేందుకు వ్యాపారులు ముందుకొచ్చారు. వారు తోటల వద్దకే వచ్చి కొనుగోళ్లు జరుపుతున్నారు. అప్పట్లో రెండు, మూడో పంటల నాణ్యత ఉండదని వ్యాపారులు పంట కొనుగోలుకు అయిష్టత చూపేవారు. అయితే ఇప్పుడు అరటి దిగుబడులు ఉన్నాయని తెలిస్తే చాలు వ్యాపారులు రెక్కలు కట్టుకొని వాలిపోతున్నారు. ఇది రైతులకు ఊరటనిస్తోంది.

జిల్లాలో అరటి సాగు - లాభం ఇలా..: జిల్లాలో అరటి సాగు 20 వేల ఎకరాలకు పైగా ఉంది. దిగుబడులు ఇచ్చే మొదటి, రెండో పంట 10 వేల ఎకరాల్లో ఉంది. మంచి ధర పలుకుతుండడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ఎకరా సాగులో 1,200 టిష్యూకల్చర్ అరటి మొక్కలు నాటుతారు. పది నెలల సమయంలో దిగుబడులు చేతికందుతాయి. ఎకరా సాగుతో 20 నుంచి 25 టన్నులు దిగుబడులు చేతికందుతాయి. ఎకరా సాగుకు బిందు సేద్యం, ఎరువులు, పిలకలకు రూ.2 లక్షలు పెట్టుబడి అవుతుంది. ప్రస్తుత ధరల ప్రకారం 22 టన్నులకు రూ.18 వేల ధరతో లెక్కవేస్తే రూ.3.96 లక్షల ఆదాయం వస్తుంది. పెట్టుబడులు రూ.2 లక్షలు మినహాయిస్తే రూ.1.96 లక్షలు మిగిలినట్టే.

రూ.18 వేలతో కొనుగోలు: మొదటి పంట కొనుగోలుకు వ్యాపారులు మంచి ధర పెట్టేవారు. మూడో పంట దిగుబడులు బాగా ఉండవని వ్యాపారులు పంట కొనుగోలుకు ముందుకు వచ్చేవారు కాదు. తోటల్లో అరటిపంట మాగిపోయి రైతులు నష్టపోయేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవు. మొదటి పంటను రూ.18 వేల నుంచి 20 వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తుండగా మూడో పంటను ఇదే ధరతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. **- రంగానాయుడు, అరటి రైతు, పార్నపల్లె.**

ఊహించని ధరలు: తమిళనాడు, మహారాష్ట్రల్లో అరటి దిగుబడులు తగ్గాయి. దీంతో జిల్లాలో అరటి పంటకు రెక్కలొచ్చాయి. ఈ ధరలు రెండు నెలల వరకు నిలకడగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు. వ్యాపారులు మూడో పంట కొనుగోలుకు ముందుకు వస్తున్నారంటే అరటికి డిమాండు ఉన్నట్టే. రోజువారీ ధరలను విచారించి విక్రయించడం మేలు. **- వేంకటేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ ఏడీ.**

చేతిలో కోట్లు పని జరిగితే ఒట్టు

(మొదటిపేజీ తరువాయి) ఇవ్వాలనేది లక్ష్యం. స్థూలంగా ఇక్కడ ఓవర్‌హెడ్ ట్యాంకులు, పంపిణీ లైన్లు, కుళాయి కనెక్షన్లు ఇవ్వాలనేది ఉద్దేశం. ఇక్కడ, డిస్ట్రిబ్యూటరీ లైన్లు కొత్తగా ఈ అమృత్ కింద 66 కిలోమీటర్ల మేర నిర్మించాలని అధికార గణం నిర్ణయించింది. దీనికి సంబంధించి డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) పూర్తిచేసి 2016 సెప్టెంబరులో మొదటిసారి టెండర్లు పిలిచారు. ఇందులో ఓ వ్యక్తి అవకాశం దక్కించుకోగా.. అయితే సాంకేతిక అర్హత లేని కారణంగా అతని టెండరును తిరస్కరించారు. దాంతో మొదటిదశ టెండర్లు అక్కడితో రద్దయ్యాయి. మళ్లీ అదే ఏడాది నవంబరులో రెండోదశ టెండర్లు పిలిచారన్నది తరచిచూస్తే అర్థమవుతోంది. ఆ సమయంలో టెండరు వేయడానికి ఎవరూ ముందురాకపోవడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ క్రమంలో వ్యవహారం స్తబ్ధుగా మారింది. ఇదిలాఉంటే ఈ ఏడాది జులై 20న మళ్లీ మూడోసారి టెండర్లు పిలిచారు. ఆగస్టు 5వ తేదీ నాటికి టెండరు గడువు ముగిసిపోగా.. ఎవరూ ముందుకు రాలేదన్నది నిష్ఠురసత్యం.

ఇదీ అసలు సమస్య: ఇక్కడ అమృత్ పథకంలో కేంద్రం 50 శాతం నిధులు అందివ్వనుండగా.. మిగిలిన 20 శాతం నిధులు రాష్ట్రప్రభుత్వం, 30 శాతం స్థానికసంస్థలే భరించాల్సి ఉంటుంది. అయితే ఆ స్తోమత లేని సంస్థలు తమ అభ్యర్థనను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తే ఆ 30 శాతం నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వమే మంజూరు చేస్తుంది. ఆ మేరకు నివేదించాల్సిన బాధ్యత స్థానిక సంస్థలపై ఉంటుంది. అయితే కడప నగరపాలకసంస్థ పరంగా పాలకవర్గంగా ప్రతిపక్షం ఉండగా.. జిల్లాలో హవా సాగిస్తోంది మాత్రం అధికార పక్షం వారే. ప్రస్తుతం ప్రభుత్వానికి అభ్యర్థన, నిధుల మంజూరు పరంగా ఇరుపక్షాల మధ్య పొసగడం లేదన్నది నిష్ఠుర సత్యం. దీంతో నిధుల మంజూరుకు మరిన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడే తరచిచూస్తే మరో అంశం పక్కాగా స్పష్టమవుతోంది. ఇద్దరు కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు సమస్యను జటిలం చేస్తోంది. ఆ ఇద్దరు తమ పంతం నెగ్గించుకోవడానికి.. తమ వారికే పనులు దక్కేలా చక్రం తిప్పుతున్న తీరు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. తరచిచూస్తే.. రాష్ట్రంలో దాదాపు మూడోవంతు పట్టణ, నగరాల్లో ప్రస్తుతం అమృత్ పథకం కింద టెండర్ల ప్రక్రియ పూర్తిచేసుకుని.. మొదటిదశ పనులు పూర్తయ్యాయి. కొన్ని చివరి దశలో ఉండగా.. రెండోదశ పనులకు అక్కడ టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అయితే కడప నగరపాలకసంస్థ పరిధిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం మొదటివిడత కింద రూ.43.80 కోట్లు మంజూరైతే.. రెండోవిడత కింద 2016-2020 మధ్యకాలంలో నాలుగేళ్ల సమయానికి గాను కేంద్రం రూ.108 కోట్లు మంజూరు చేసింది. అయితే ఇక్కడ మొదటిదశ పనులకే దిక్కులేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. మొత్తంగా అమృత్ నిధులు కడప నగరపాలికకు ఉపయోగపడకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ వ్యవహారంపై ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని త్వరితగతిన టెండర్ల ప్రక్రియను పూర్తిచేయడంతో పాటు.. పక్కాగా నిధులు ఉపయోగపడేలా చూడాల్సి ఉంది. ఇదే అంశంపై కడప నగరపాలక కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డితో 'ఈనాడు' మాట్లాడగా.. అర్హత ఉన్న వారు టెండరు వేయడానికి ముందుకురావడం లేదని.. వేసిన వారికి సాంకేతిక పరమైన అర్హతలు లేవని చెప్పారు. సమస్య త్వరితగతిన పరిష్కరించి.. మొదటిదశ పనులను ఆరంభించే దిశగా అన్ని చర్యలూ తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

ఆదరణ కరవై ఆపన్నహస్తం కోసం..!

☆ కడప నుంచి హొసపేటె చేరిన బాలురు
☆ ఆశ్రయమిచ్చిన సహాయవాణి సిబ్బంది



పిల్లలను చేరదీసిన సహాయవాణి సిబ్బంది

హొసపేటె, న్యూస్‌టుడే: తల్లి మృతితో.. తండ్రి నిర్లక్ష్యానికి గురైన కడప జిల్లా రాజంపేటకు చెందిన ఇద్దరు చిన్నారులు ఆదివారం హొసపేటెలో ప్రత్యక్షమయ్యారు. రైల్వేస్టేషన్‌లో కూర్చొన్న పిల్లలను గమనించిన పోలీసులు పట్టణంలోని పిల్లల సహాయవాణికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఇద్దరినీ చేరదీశారు. రైల్వే పోలీసులు, సహాయవాణి సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. వీరు కడప జిల్లా రాజంపేటకు చెందిన రమణయ్య-పద్మ దంపతుల పిల్లలు. పెద్దవాడు సమీర్ (13) కొంత బుద్ధి మాంద్యుడు. రెండోవాడు వెంకటేశ్ (11) 5వ తరగతి చదువుతున్నాడు. కొన్నేళ్లక్రితం తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. కూలీ పనులకు వెళ్లే తండ్రి రాత్రి ఎప్పుడొస్తాడో, ఉదయం ఎప్పుడు వెళ్లిపోతాడో కూడా తెలియడం లేదు. పొరుగింటి వారు పెట్టే ఆహారం తింటూ కాలం వెళ్లదీస్తున్న వీరు ఆదివారం హొసపేటె చేరారు. కడపలోని తమ పెద్దమ్మ ఇంటికి వెళ్తామంటూ పొరుగింగ్లో చెప్పామంటున్నారు. ఇద్దరు పిల్లలను చేరదీసి బళ్లారిలోని శిశు సంరక్షణ కేంద్రానికి పంపినట్లు సహాయవాణి సిబ్బంది చిదానంద పేర్కొన్నారు.

కొనసాగుతున్న తపాలా సేవకుల నిరవధిక సమ్మె

రవీంద్రనగర్, కడప న్యూస్‌టుడే: ఏడవ వేతన సంఘ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా తపాలా సేవకులు చేస్తున్న సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా కడప డివిజన్ ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఆదివారం జరిగిన సమ్మెలో డివిజన్ మహిళ విభాగం అధ్యక్షురాలు సాయిప్రసన్న, పద్మావతి, మంగళ గౌరి, రెడ్డెమ్మ, అరుణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మె చేస్తున్న తపాలా సేవకులను ఉద్దేశించి డివిజన్ మహిళ విభాగం అధ్యక్షురాలు సాయిప్రసన్న మాట్లాడుతూ.. తపాలా సేవకుల చేత 160 సంవత్సరాల నుంచి వెట్టి చాకిరి చేయించుకుంటూ సరైన జీత భత్యాలు ఇవ్వకుండా రెగ్యులర్ చేయకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. తక్షణమే ఏడో వేతన సంఘ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.



సమ్మె చేస్తున్న తపాలా సేవకులు



సంపద సృష్టికేంద్రం నిర్వహణ సభ్యులు

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి, పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చడానికి సంపద సృష్టి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి పంచాయతీ కేంద్రానికి నిధులు మంజూరు చేసింది. స్థల సమస్య కారణంగా చాలా పంచాయతీల్లో కేంద్రాలు నిర్మాణానికి నోచుకోలేదు. సంపద సృష్టి కేంద్రం నిర్వహణలో వల్లూరు పంచాయతీ జిల్లాలో ఆదర్శంగా నిలుస్తోంది. చెత్తనుంచి సంపద సృష్టిస్తున్నారు. ఇతర జిల్లాల పంచాయతీ అధికారులు, సర్పంచులు సందర్శించి నిర్వహణ గురించి తెలుసుకుని వెళుతున్నారు.

అతివల విజయం



ఇంటింటినుంచి తడిపొడి చెత్తసేకరణ

చెత్త నుంచి సంపద సృష్టి!
ఆదర్శంగా నిలుస్తున్న వల్లూరు

వల్లూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రం వల్లూరులో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం జిల్లాలో ఆదర్శంగా నిలిచి అందరి నుంచి ప్రశంసలు అందుకుంటోంది. నిర్వహణ తీరును పరిశీలించిన అధికారులు అభినందించి వల్లూరు కేంద్రాన్ని జిల్లా శిక్షణా కేంద్రంగా మార్చారు. పొరుగు జిల్లా అధికారులు సైతం పరిశీలించి పనితీరు గురించి తెలుసుకుంటున్నారు. జిల్లాలో ప్రారంభమైన తొలి సంపద సృష్టి కేంద్రం ఇదే. దేశప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని అమలు చేయడంలో వల్లూరు పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ముందుకు సాగుతోంది. ఏడాది కిందట స్వచ్ఛభారత్ నిధులు రూ.3.5 లక్షలతో కేంద్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెత్త నుంచి సంపద సృష్టించడమేమిటని అప్పట్లో కొందరు నవ్వారు. సర్పంచి శారద, కార్యదర్శి శారదారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చెత్తసేకరణ కోసం రెండు రిక్షాలను కొనుగోలు చేశారు. ఇంటింటికి తిరిగి స్వచ్ఛభారత్ కార్యక్రమం ఆవశ్యకత గురించి వివరించారు. వీధులలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే అపరిశుభ్రత ఏర్పడడంతో పాటు అనారోగ్యానికి దారితీస్తుందన్న విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించడంలో విజయం సాధించారు. తడిపొడి చెత్తను వేరుచేసి ఇచ్చేలా ఇంటికి రెండు చొప్పున ప్లాస్టిక్ బుట్టలను అందజేశారు. 2016 జులైలో ఐదుగురు హరితరాయబారులతో కేంద్రం నిర్వహణను ప్రారంభించారు. ప్రస్తుతం ఆరుగురు పనిచేస్తున్నారు. ఆరు రిక్షాలను అందుబాటులో ఉంచారు. హరితరాయబారులు తీసుకొచ్చిన చెత్తను తొట్లలో నిల్వచేస్తున్నారు. పంచాయతీ పరిధిలోని వల్లూరు, బాలుగారిపల్లె, సి.కొత్తపల్లె, ఇసుకపల్లె, లింగాయపల్లె, అచ్చింతల ఓబాయపల్లె, గంగాయపల్లె గ్రామాల రైతులతో సమావేశాలు నిర్వహించి పశువుల పేడను కేంద్రానికి ఉచితంగా అందించేలా ఒప్పందం చేసుకున్నారు. రైతులు అందించిన పశువుల పేడకు కేంద్రంలో తయారైన సేంద్రియ ఎరువును కొంత ఉచితంగా ఇస్తున్నారు. సేకరించిన పశువుల పేడను నింపేందుకు అదనంగా మరో ఆరు తొట్లను నిర్మించారు. వానపాములను వదిలి స్వచ్ఛమైన సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఆ ఎరువును ఉపాధి హామీ అధికారులకు విక్రయించి సంపదను సృష్టిస్తున్నారు. ఇటీవల స్వచ్ఛభారత్ రాష్ట్ర సమన్వయకర్త సూర్యచంద్ర కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులను అభినందించారు.

ప్రజల సహకారంతోనే విజయవంతం



గ్రామీణుల్లో అవగాహన లేమి కారణంగా పరిసరాల పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వరు. సాధారణ వ్యాధుల్లో 70 శాతం అపరిశుభ్రత కారణంగా వస్తాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని వైద్యసిబ్బంది చెప్పిన మాటలు నన్ను ఆలోచనలో పడేశాయి. సంపద సృష్టి కేంద్రం ఏర్పాటు చేస్తే పారిశుద్ధ్యం మెరుగుపడడమే కాక, పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని తెలిసి కేంద్రం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించా. నిత్యం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ కేంద్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాం. స్వచ్ఛమైన గ్రామంగా వల్లూరుకు గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. ప్రజలు సహకరించడం వల్లనే ఇదంతా సాధ్యమైంది. **- శారద, సర్పంచి, వల్లూరు**


నవ్వినవారే అభినందిస్తున్నారు



చేసే ప్రతి పని ఇష్టంతో చేయడం నాకు అలవాటు. ఈ రోజు విధులు ముగించాం.. ఇంటికి వెళ్లాం అనికాకుండా చేతనైనంత వరకు ప్రజలకు సేవ చేయాలన్నదే ఆశయం. అదే భావాలున్న సర్పంచి సహకారం లభించడంతో సమస్యలన్నింటినీ అధిగమించాం. మా ఆశయానికి జిల్లా అధికారులు సహాయ సహకారాలను అందించారు. చెత్తనుంచి సంపద రావడమేమిటని అప్పట్లో కొందరు నవ్వుకొన్నారు. ఇప్పుడు వారే అభినందిస్తున్నారు. **- శారదారెడ్డి, కార్యదర్శి, వల్లూరు**



కాలువలు ఇలా ఉంటే నీరు ఎలా ప్రవహిస్తుంది



గడ్డి మొక్కలతో కనిపిస్తున్న కాలువ



ఇది కాలువ.. పూడిక తీసేదెవరు


జల'దారులు'.. బాగుపడితేనే సిరులు

చెరువు.. పల్లె ఆత్మబంధువు. గ్రామీణ జీవనానికి పునాది. కర్షకుల కల్పతరువు. అలనాటి పాలకులు ముందుచూపుతో నిర్మించిన జల వనరులు నేటికీ హరిత కాంతులను పంచుతున్నాయి. కాలక్రమేణా నిర్వహణపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. జల ప్రవాహానికి కీలకమైన కాలువల నిండా పూడిక చేరింది. కంప చెట్లు, ముళ్లపొదలు అల్లుకున్నాయి. చుక్క నీరు ముందుకు కదిలే పరిస్థితి లేదు. కట్టల బలోపేతం, అలుగుల పునరుద్ధరణ.. తూముల మరమ్మతులు.. తటాకంలో చేరిన పూడికతీత పనుల కోసం రూ.కోట్లు ధారపోస్తున్నారు. ఆయకట్టుకు సాగునీరు అందించే కాల్వలను మరమ్మతు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ చూపితే పుడమి పుత్రులకు ప్రయోజనం చేకూరనుంది.

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : జిల్లాలో చిన్ననీటి వనరులు 1,841 ఉన్నాయి. ఆనకట్టలు, ఊట కాల్వలు, చిన్న, పెద్ద కుంటలు, చెరువుల పరిధిలో 1,11,225 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. వంద ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న చెరువులు 234 ఉండగా వీటిపరిధిలో 66,946 ఎకరాల పొలం ఉంది. వంద ఎకరాల లోపు పొలాలు ఉన్న చెరువులు, కుంటలు 1,542 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటి పరిధిలో 32,295 ఎకరాల ఆయకట్టు ఉంది. తూము నుంచి విడుదల చేసిన నీరు ఆయకట్టుకు చేరాలంటే కాల్వలు బాగుండాలి. ఒకనాడు గడ్డిపోచ కూడా కాల్వల్లో ఉండేది కాదు. సమష్టిగా కదలి శుభ్రం చేసేవారు. నాటి స్ఫూర్తి కరవైంది. ఎవరిదారి వారిదే అన్నట్లు కావడంతో కాలువల బాగోగులను ఎవరూ పట్టించుకోవట్లేదు. పాలకులు కూడా విస్మరించారు. పూడిక చేరి కాల్వలు రూపు కోల్పోయాయి. భారీ వర్షాలు కురిస్తే చెరువుల్లోకి నీరు చేరనుంది. పొలాలకు నీరు విడుదల చేయాలంటే కాలవలు బాగుండాలి. కానీ చాలాచోట్ల అధ్వానంగా ఉన్నాయి. ఒంటిమిట్ట చెరువు కింద ఒంటిమిట్ట, మలకాటిపల్లి, సాలాబాదు, చిన్న, పెద్ద కొత్తపల్లి, చెంచుగారిపల్లి, చెర్లోపల్లి, నడింపల్లి, పోలుబుచ్చయ్యగారిపల్లి రైతులకు 1014 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇక్కడ ఉన్న కాలువలన్నీ అధ్వానంగా ఉన్నాయి. గంగపేరూరు, చింతరాజుపల్లి, మంటపంపల్లె చెరువుల కింద అదే తీరు. జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల ఇదే తీరు.

జిల్లాలోని చిన్ననీటి జలవనరులు, వాటి పరిధిలోని ఆయకట్టు వివరాలు ఇలా..

జలవనరులు	సంఖ్య	ఆయకట్టు (ఎకరాలు)
ఆనకట్టలు	11	1,631
ఊట చెరువులు	18	3,469
ఊట కాలువలు	36	6,884
పెద్ద చెరువులు	234	66,946
చిన్న చెరువులు	1,542	32,295



'నీరు-చెట్టు'లో చేయరేంటి

జిల్లాలో 'నీరు-చెట్టు'లో భాగంగా 6,558 పనులు చేసేందుకు రూ.599.07 కోట్లతో ప్రతిపాదించారు. 3,685 పనులను రూ.336.39 కోట్లతో చేయాలని జల వనరుల శాఖ అధికారులు అనుమతిచ్చారు. రూ.99.24 కోట్లు విలువ చేసే రూ.1,007 పనులు పూర్తయ్యాయి. 1,726 వివిధ దశల్లో ఉండగా వీటి విలువ రూ.85.29 కోట్లు. నిర్మాణంలో ఉన్నవి, పూర్తైనవి పరిగణలోకి తీసుకుంటే 2,733 పనుల విలువ రూ.184.53 కోట్లు ఉంటుందని అంచనా. వంకలు, వాగుల్లో పూడిక తీశారు. చెక్‌డ్యాంలను నిర్మిస్తున్నారు. కట్టలను పటిష్ఠం చేసి తూములను బాగు చేయిస్తున్నారు. పంట, పిల్ల కాల్వల్లో పూడిక తీయించాలనే ఆలోచన మనోళ్లకు ఏమాత్రం లేదనే చెప్పాలి. అక్కడక్కడ స్థానిక నాయకులు ఒత్తిడి తీసుకొస్తేనో, రైతుల నుంచి విన్నపాలు వస్తే చేపడుతున్నారు.

ఆక్రమణలతో కనుమరుగు

వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన చెరువుల కాలువల ఆనవాళ్లు కోల్పోయాయి. దురాశతో పొలంలో కలిపేస్తున్నారు. ఇదేమని అడిగేవారు లేరు. విశాలంగా ఉన్న కాల్వలు చిక్కిపోతున్నాయి. విషయం జలవనరుల శాఖ సాంకేతిక నిపుణులకు తెలియంది కాదు. నీరు-చెట్టులో కాసులు తీసుకొచ్చే పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఏఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ స్థాయి అధికారులెవ్వరూ ఇటువైపు తొంగి చూడట్లేదు. అడిగే వారు లేరు. అడ్డుకునే చేతల్లేవు. ఏకశిలానగరిలో గోకులమిట్ట కాలువను కొంతమంది ఆక్రమించేసి దున్నేశారు.

ఉపాధిలో పూడికతీత

ఉపాధి హామీ పథకంలో పంట, పిల్ల కాల్వల్లో పూడిక తీస్తున్నారు. కంప, ముళ్ల పొదలను తొలగిస్తున్నారు. రెండేళ్లకు ఒకసారి ఈ పనులు చేస్తున్నారు. కొంతవరకు బాగుపడుతున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేమి, రైతుల అభ్యంతరాలతో లోతు తక్కువగా తీస్తున్నారు. తీసిన మట్టి పక్కనే గట్టుపైన వేస్తున్నారు. మున్నాళ్లకే మళ్లీ పూడిక చేరుతోంది. జల ప్రవాహానికి అడ్డంకులు ఎదురవుతున్నాయి.

చెరువులను పటిష్ఠం చేస్తున్నాం

జిల్లాలో ఉన్న చెరువులను పటిష్ఠం చేస్తున్నాం. దెబ్బతిన్న అలుగుల పునరుద్ధరణ చేసి, పనిచేయని తూములను గుర్తించి మరమ్మతులు చేయాలని నిర్ణయించాం. ఇప్పటికే 'నీరు-చెట్టు'లో కొన్ని పనులను మంజూరు చేశాం. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కాలువల్లో పూడిక చేరితే రైతులే చేసుకోవాలి. పాత రోజుల్లో ఆయకట్టుదారులే ముందుకొచ్చి బాగు చేసుకునేవారు. పిల్ల కాల్వల నిర్వహణ బాధ్యత సాగుదారులే చూసుకోవాలి. తూము నుంచి నీటి విడుదల చేసే ప్రధాన కాల్వలు పాడై ఉంటే బాగు చేయిస్తాం.

- కె.గోపాల్‌రెడ్డి, పర్యవేక్షక నిపుణుడు, జల వనరులశాఖ, కడప



చిత్రంలో కనిపిస్తున్న కల్వర్టు పల్లవోలు, నాగులపల్లె చెరువుల కట్టవెంట వెళ్లేదారిలోనిది. రెండు చెరువుల కింద 1500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఖాదర్‌పల్లె, పల్లవోలు గ్రామాలకు చెందిన పొలాలున్నాయి. వర్షం వస్తే కాల్వలన్నీ కొట్టుకుపోతాయి. నాసిరకం పనులతో కల్వర్టు నిర్మించగా దెబ్బతింది. నాలుగేళ్లుగా పట్టించుకోలేదు. ఈ మార్గంలో వ్యవసాయ పనులు చేసుకునేందుకు వెళ్లే రైతులు అవస్థలు పడుతున్నారు. సాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



ఆడపిల్లలకు చదువెందుకనే రోజులు పోయాయి. బాలురతో పోటీపడుతూ ర్యాంకులు సాధిస్తున్నారు. క్రీడల్లోనూ సత్తా చాటుతూ దూసుకుపోతున్నారు. చాపాడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న తిమ్మనబోయిన భారతి జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తోంది. మూడేళ్లుగా జోనల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పలు బహుమతులు సాధించింది. రగ్బీ క్రీడలో రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకుంటోంది.

- చాపాడు, న్యూస్‌టుడే

రగ్బీలో రారాణి భారతి
జాతీయ స్థాయిలో గుర్తింపు

భారతి సొంతూరు చక్రాయపేట మండలం. తల్లిదండ్రులు ఓబయ్య, విజయమ్మ. గ్రామంలో చిన్నగొడవల కారణంగా ఊరు వదలాల్సి వచ్చింది. ప్రాథమిక విద్యాభ్యాసంలోనే చదువుకు ఆటంకాలు ఎదురయ్యాయి. కమలాపురం మండలం కోగటంలో 5వ తరగతి వరకు చదివింది. ఆర్థిక ఇబ్బందులు కారణంగా అప్పట్లోనే పత్తి తీసేందుకు, వేరుసెనగలో కలుపు తొలగించేందుకు కూలి పనులకు వెళతూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేది. కమలాపురం మండలం కంచెన్నగారిపల్లెలో ఉన్న బంధువుల వద్దకు చేరుకున్నాక ఓ బాలిక చాపాడు కస్తూర్బాలో చదువుతోందని తెలుసుకుని భారతి కూడా ఆరోతరగతిలో చేరింది. అప్పటి నుంచి చదువుకుంటూ ఆటలవైపు మొగ్గు చూపింది. అరుదైన, కష్టతరమైన రగ్బీ క్రీడను ఎంచుకుంది. కబడ్డీ, పరుగుపందెం, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లోనూ సత్తాచాటుతోంది.



సాధించిన పతకాలతో

సాధించిన విజయాలు

రగ్బీ అండర్-14 విభాగంలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు బిహార్ రాష్ట్రం పాట్నాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పంజాబ్, బిహార్, తెలంగాణ రాష్ట్రాలతో గెలుపొంది ప్రశంసా పత్రం అందుకుంది. గోవా జట్టుతో జరిగిన పోటీల్లో ఓటమి చెందారు. గతేడాది చెన్నైలో జరిగిన జాతీయ రగ్బీ పోటీల్లో సీనియర్స్ జట్టులో భారతి స్థానం సంపాదించి తెలంగాణా, మహారాష్ట్ర, బిహార్ జట్లతో విజయం సాధించింది.

* 2016లో జరిగిన 29వ రాయలసీమ ఓపన్ అథ్లెటిక్స్ మీట్‌లో వంద, 400 మీటర్ల పరుగుపందెంలో భారతి ద్వితీయస్థానంలో నిలిచింది. నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో ఛాంపియన్‌షిప్ సాధించింది. ప్రొద్దుటూరు పట్టణం ఎస్‌సీఎన్ఆర్ ఆర్ట్స్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో మూడు కిలోమీటర్ల పరుగు పందెంలో తృతీయ, ఈ ఏడాది 30వ రాయలసీమ ఓపన్ అథ్లెటిక్స్ మీట్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించింది. 2017 ఆగస్టు 3న ప్రొద్దుటూరులో జిల్లా స్థాయిలో జరిగిన జూనియర్ అథ్లెటిక్స్‌లో వంద మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్‌లో ద్వితీయ, లాంగ్‌జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచి పతకాలు అందుకుంది.

పీఈటీ కావాలన్నది లక్ష్యం

చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. పల్లెలో తోటి పిల్లలతో పందెం పెట్టుకుని పరిగెత్తేవారం. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్నా చదువును నిర్లక్ష్యం చేయలేదు. చదువు పూర్తయ్యాక వ్యాయామ ఉపాధ్యాయురాలి ఉద్యోగం సంపాదించాలన్నదే లక్ష్యం. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఇతర పట్టణాలకు, ప్రాంతాలకు వెళ్లాలంటే వ్యాయామ ఉపాధ్యాయురాలు రమాదేవమ్మ, ప్రత్యేక అధికారిణి మల్లీశ్వరి సహకరిస్తున్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించగలనన్న నమ్మకం ఉంది.

- భారతి, విద్యార్థిని

రగ్బీ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు



జారిందా గూడు.. మిగిలేది గోడు

ఎంత చెట్టుకు అంత గాలి అన్నారు పెద్దలు. శృతి మించితే అనర్థానికి దారితీస్తుంది. ఇది ఆటోలకూ వర్తిస్తుంది. ఇటీవల తరచూ ఆటో ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా మార్పు లేదు. ప్రయాణికుల చేరవేత నుంచి సరకులు, వస్తువులు, పరికరాలు, మూగజీవాలను చేరవేస్తున్నారు. ఆటోల సంఖ్య పెరిగిన నేపథ్యంలో వచ్చిన బాడుగ అవకాశాన్ని వదులుకోవడం లేదు. గొర్రె పిల్లల రక్షణ కోసం ఉపయోగించే పెద్ద గూళ్లను ఆటోలకు కట్టుకుని తరలిస్తున్నారు. బలంగా గాలులు వీచినా.. గూడు దిగువకు జారినా ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. అనుకోని సంఘటన జరిగితే కుటుంబానికి తీరని విషాదాం మిగలనుంది.

- మైదుకూరు, న్యూస్‌టుడే





'ఎర్రగుడి' నేటి ఎర్రగుడిపాడు

మీకు తెలుసా?



క్రీస్తు పూర్వం 575 సంవత్సరంలో జనమేజయ మహారాజు ఎర్రని ఇటుకలతో చెన్నకేశవస్వామి ఆలయం కట్టించారు. అప్పట్లో ఆ ఆలయాన్ని ఎర్రగుడి అని పిలిచేవారు. కాలక్రమేణా అక్కడ గ్రామం ఏర్పడింది. ఉన్న గుడికి రంగులు వేసి పైన శిల్పాలను ఏర్పాటు చేయడంతో ఎర్రరంగు పూర్తిగా మారిపోయింది. రాను రాను ఎర్రగుడి పేరునే అక్కడ ఏర్పడిన గ్రామాన్ని ఎర్రగుడిపాడుగా పిలుస్తున్నారు. అప్పట్లో నిర్మించిన ఆలయం ఇప్పటికీ చెక్కుచదరలేదు

- కమలాపురం, న్యూస్‌టుడే

వాట్సాప్ సందేశం.. పని సులభతరం



ఇనుపచువ్వలు అమర్చిన చెప్పులు ధరించి విద్యుత్తు స్తంభాన్ని సులభంగా ఎక్కుతున్న ఉద్యోగి



చెప్పులకు అమర్చిన ఇనుపచువ్వలు

వాట్సాప్‌లో వచ్చిన ఓ సందేశం విద్యుత్తు స్తంభాన్ని సులభంగా ఎక్కేందుకు ఉద్యోగులకు ఉపయోగపడుతోంది. దీంతో కష్టం లేకుండా సులభంగా వారు విద్యుత్తు స్తంభాన్ని ఎక్కి, తీగెలను అమర్చేందుకు అవకాశం ఏర్పడింది. వాట్సాప్‌లో సభ్యులుగా ఉన్న కొందరు ఇటీవల స్తంభాన్ని సులభంగా ఎక్కేందుకు అవసరమైన పరికరాన్ని తయారుచేసి, ఆ సందేశాన్ని పంపారు. దీంతో వేములకు చెందిన విద్యుత్తు సిబ్బంది ఆ సందేశం ప్రకారం చెప్పులకు ఇనుప చువ్వలను ఏర్పాటుచేసి ఓ పరికరాన్ని తయారుచేశారు. ఇందుకు రూ.1300 వరకూ వ్యయమైంది. వీటి సాయంతో కార్మికులు అలసట లేకుండా స్తంభాలను ఎక్కుతూ చక్కగా పనులు చేస్తున్నారు. ఇవి తమకెంతో సాయపడుతున్నట్టు వారు పేర్కొంటున్నారు.

- వేముల, న్యూస్‌టుడే

ఉక్కు దీక్షల్లో దివ్యాంగులు


దీక్షలను ప్రారంభిస్తున్న పీఆర్టీయూ నాయకులు

బిల్టప్, (కడప) న్యూస్‌టుడే: కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కోటి రెడ్డి కూడలిలో నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలలో దివ్యాంగులు కూర్చున్నారు. 45వ రోజైన ఆదివారం పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణమరాజు ప్రారంభించారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఇక ఉద్యమాలను ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. చట్టాలు లేక పోయినా జీఎస్టీ, నోట్ల రద్దు వంటి కార్యక్రమాలను రాత్రికి రాత్రే అమలు చేస్తారు. చట్టంలో పొందుపరిచిన వాటిని మాత్రం అమలు చేయడానికి మీనమేషాలు లెక్కించడం జరుగుతుంది. ఇలాంటి ప్రభుత్వం ప్రజలు ఎన్నడూ చవిచూసివుండరని అన్నారు. యువత ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీలకతీతంగా ఉద్యమంలో పాలల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఓబులేసు, శేఖర్, రాజు, మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 తారక్ మామా అయ్యో రామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ. 6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ. 9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్. వి. ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో** – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, **ఉ.9:30: వావ్ ఏమి రుచి** – అఖిడీ టుకో అష్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు** – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, **ఉ.11.00: గోరు ముద్దలు** – ఆఫ్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ** – ఫ్రూటీ ఓట్స్, **ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్** - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్** – ఓట్స్ మసాల పూరీ, **మ.12.30, రా.8.45: "కొ అండ్ కొఫ్" సూపర్ చెఫ్** - ఫ్రీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, **మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్** - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి** – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, **మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్** – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, **మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్** – బీన్స్ ఉసిలి, **మ.2.30, సా.6.00: చోటా షెఫ్** – సాబూదాన చుడ్వా, **మ.2.45, రా.10.45: జిల్** – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, **మ.3.00: ఛాయ్ బిస్కెట్** – కాల్ జోన్స్ & చాక్లెట్ ఆల్మండ్ కాఫీ, **మ.3.15: సూప్స్ & స్టార్టర్స్** - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: **శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: **శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా,** **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం,10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

SVBC: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్. డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: **రాక్షసుడు.**

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: **రాజాబాబు, మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: **కితకితలు.**

HBO: ఉదయం: 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

యాంత్రీకరణ తోనే గిట్టుబాటు సాగు

పనులకు వినియోగించే పశుసంపద తరిగిపోవడం, కూలీల కొరత ఏర్పడటంతో వ్యవసాయం పెనుభారంగా మారింది. ఈ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని యంత్రాలతో చేయక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. యంత్రాలు రైతుల శ్రమను, సాగు ఖర్చును 30 నుంచి 60 శాతం వరకు తగ్గించే అవకాశాలున్నాయి. కనుక వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలంటే యాంత్రీకరణ అవసరమని చిత్తూరు రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు భాస్కరయ్య అన్నారు.


యంత్రంతో వరి నాటుతున్న రైతు

యంత్ర పరికరాలు: నేల దున్నటానికి కల్టివేటరు, రోటోవేటరు, విత్తనం వేయడానికి సీడ్‌డ్రిల్లర్, ప్లాంటర్, అంతరకృషి కోసం పవర్‌వీడర్, సస్యరక్షణ కోసం చిన్న స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్, పంట కోత యంత్రాలు, మల్టీ క్రాప్ క్రషర్, వరికోత యంత్రం తదితర అధునాతన యంత్రాలతో పాటు నీటి సరఫరా కోసం స్ప్రింక్లర్లు, జల ఫిరంగులు, బిందుసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఈ పరికరాలన్నింటిని ట్రాక్టర్లకు అనుసంధానం చేసుకుని ఉపయోగించుకోవచ్చు. వ్యవసాయ శాఖ యాంత్రీకరణ పథకం కింద పెద్ద ఎత్తున రాయితీపై యాంత్రీకరణ ఉపకరణాలను అందచేస్తున్నది. వ్యవసాయాధికారులను సంప్రదించి రాయితీ ధరలకు రైతులు కొనుగోలు చేసుకోవచ్చు. రాయితీపై జల ఫిరంగులు, స్ప్రింక్లర్లు, బిందుసేద్యం పరికరాలను ఆయా మండలాల్లోని సూక్ష్మ నీటిపారుదల పథకం ఏరియా అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను సంప్రదించి దరఖాస్తు చేసుకుంటే నిబంధనల ప్రకారం పంపిణీ చేస్తారు. సాగులో యాంత్రీకరణ పద్ధతులను అవలంబిస్తే వ్యవసాయ రంగం లాభాల బాట పట్టే అవకాశం ఉంది. ఇందుకు అవసరమైన ఆచరణాత్మక ప్రణాళికలు రైతులకు ఎంతో అవసరం.

–న్యూస్‌టుడే, చిత్తూరు (వ్యవసాయం)

సజ్జ పంటలో సస్యరక్షణ


వెర్రికంకి తెగులు సోకిన మొక్క

జొన్న తర్వాత రైతులు అధికంగా పండించే పంట సజ్జ. ఇందులో మంచి పోషకాలు ఉంటాయి. ప్రస్తుతం పంటల సాగు మొదలై నెలన్నరకు పైగా అవుతుందని, సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని, మండల వ్యవసాయాధికారి షేక్షావలి తెలిపారు.

పచ్చకంకి లేదా వెర్రికంకి తెగులు: తెగులు సోకిన మొక్క కాండంపై పూర్తిగా లేదా అసంపూర్తిగా ఆకులుగా మారిన పుష్పగుచ్ఛం ఏర్పడుతుంది. తెగులు లక్షణాలు మొదట లేత మొక్కలపై, 3-4 ఆకులు వేసే దశలో కనిపిస్తాయి. తెగులు సోకిన మొక్కలు పసుపురంగు లోకి మారుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటే ఆకుల అడుగుభాగంలో తెల్లని బూజు పెరుగుదల కనిపిస్తుంది. తెగులు తీవ్రదశలో మొక్కలు గిడసబారి 30 రోజులు లోపు చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలో కంకులు పూర్తిగా లేదా పాక్షికంగా ఆకుపచ్చని ఆకులుగా మారిపోతాయి. దీని నివారణకు కిలో విత్తనానికి 6 గ్రా. ఆప్రాన్ ఎస్.డి 35 మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి. తెగులు సోకిన మొక్కలను ఏరి కాల్చివేయాలి. విత్తిన 21 రోజులకు తెగులు సోకే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు 5 శాతం మించి ఉంటే రిడోమిల్ (25డబ్ల్యూపీ) లీటరు నీటికి 1 గ్రా. వంతున కలిపి పైరుపై పిచికారి చేయాలి.

తేనెబంక తెగులు: తెగులు సోకిన కంకి నుంచి గులాబి లేదా ఎర్రరంగుగా ఉన్న తేనె వంటి చిక్కటి ద్రవం బొట్లు బొట్లుగా కారుతుంది. ఈ ద్రవంతో శిలీంధ్ర బీజాలు ఏర్పడతాయి. మొక్కలు పుష్పించే దశలో మబ్బుతో కూడిన ఆకాశం, వర్షపు తుంపరలు, వాతావరణం చల్లగా ఉండటంతో ఈ తెగులు వ్యాప్తికి దోహదం చేస్తుంది. దీని నివారణకు విత్తనాలను లీటరు నీటికి 20 గ్రా. ఉప్పు కలిపిన నీటి ద్రావణంలో శుద్ధి చేసి, ఆరనిచ్చి కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ మందు కలిపి విత్తన శుద్ధి చేయాలి. పైరు పూతదశలో మాంకోజబ్ 2.5 గ్రా. లేదా కార్బండిజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేయాలి.

✦ తేలిక నేలల్లో చెదల నివారణకు ఎకరాకు 8 కిలోల 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని దుక్కిలో వేసి కలియదున్నాలి. లేత మొక్క దశలో మిడతల నుంచి పంటను కాపాడటానికి 5 శాతం కార్బరిల్ పొడి లేదా 2 శాతం మిథైల్‌పెరాథియాన్ పొడిని ఎకరాకు 8-10 కిలోలు చొప్పున చల్లాలి.

–న్యూస్‌టుడే, హాలహర్వి.

అంగన్‌వాడీ కేంద్రం.. అంతులేని జాప్యం

నత్తనడకన కేంద్రాల నిర్మాణాలు ■ చిన్నారులకు ఇబ్బందులు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కలసపాడులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రం-3. ఇక్కడ 38 మంది చిన్నారులు, 17 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. 15 ఏళ్లుగా చాలీచాలని వసతులతో అద్దె భవనంలో కేంద్రం కొనసాగుతుంది. గ్రామంలో మూడుకేంద్రాలున్నాయి. వీటిలో ఒకదానికి మత్రమే శాశ్వత భవనం ఉంది. ఏడాది క్రితం రూ. 9.50 లక్షలు నాబార్డు, ఎస్‌డీపీ నిధులతో నూతనంగా మరో అంగన్వాడీ కేంద్రం నిర్మించారు. 6 నెలలుగా దీన్ని అప్పగించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

కలసపాడు, న్యూస్‌టుడే : జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం 6 నెలల క్రితం నిధులు మంజూరు చేసింది. స్థలాల కొరత వల్ల కేంద్రాల నిర్మాణాలు సకాలంలో చేపట్టలేదు. ఆ తరువాత రెవెన్యూ అధికారుల సహకారంతో స్థలాలు సమకూరాయి. అయినా కేంద్రాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో కొన్నేళ్లుగా అంగన్వాడీ కేంద్రాలు శిథిల పాఠశాల గదులు, అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గతంలో నాబార్డు, ఎస్‌డీపీ నిధులతో చేపట్టిన అంగన్వాడీ కేంద్రాల భవనాలు 6 నెలల క్రితం పూర్తయ్యాయి. వీటిని అప్పగించడంలో పీఆర్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఐసీడీఎస్ అధికారులు విమర్శిస్తున్నారు.

పర్యవేక్షణ కరవు : జిల్లాకు 6 నెలల క్రితం 347 అంగన్వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. వీటికి రూ. 2016.57 లక్షల నిధులు కేటాయించారు. ఒక్కో కేంద్రానికి ఎస్‌డీపీ కింద రూ. 2 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 5 లక్షలు కేటాయించారు. అధికారులు క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చాలా కేంద్రాల నిర్మాణాలను ఆలస్యంగా చేపట్టారు. జిల్లాలో 131 అంగన్వాడీ కేంద్రాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. వీటికి రూ. 35.21 లక్షలు ఖర్చు చేశారు. 109 కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి రూ. 93.81 లక్షలు ఖర్చు చేశారు. 3 అంగన్వాడీ కేంద్రాలు మాత్రమే ఇప్పటి వరకు అందుబాటులోకి వచ్చాయి. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు నిర్మాణ పనులను నత్తనడకన కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి.

● బద్వేలు నియోజకవర్గంలోని 7 మండలాలకు 50 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. వీటికి రూ. 350 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో 12 వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. వీటికి రూ. 6.08 లక్షలు ఖర్చు చేశారు. 24 కేంద్రాల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి రూ. 36.95 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు ఒక్క అంగన్వాడీ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కలసపాడు మండలం హృదయపేట, పిడుగుపల్లె, ఎగువరామాపురం, చెన్నారెడ్డిపల్లె, కలసపాడు, దూలంవారిపల్లె, దూలంవారిపల్లె దళితవాడలో గతంలో నాబార్డు, ఎస్‌డీపీ నిధులతో నిర్మించిన నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను పీఆర్ అధికారులు నేటికీ ఐసీడీఎస్‌కు అప్పగించలేదు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ముసల్‌రెడ్డిపల్లెలో ఏడాది నుంచి ప్రాథమిక పాఠశాలలో శిథిలమైన అదనపు తరగతి గదిలో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రం. ఇక్కడ 11 మంది చిన్నారులు, 5 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఉరుస్తుండటంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. 6 నెలల క్రితం ఇక్కడ కొత్తగా అంగన్వాడీకేంద్రం మంజూరైంది. అయినా ఇక్కడ నిర్మాణ పనులు చేపట్టలేదు.

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాల తీరుతెన్నులు

మండలం	మంజూరైన అంగన్వాడీ కేంద్రాలు	వివిధదశల్లో నిర్మాణాల్లో ఉన్నవి	పూర్తి అయినవి
అట్లూరు	10	1	7
బి.కోడూరు	9	5	4
బద్వేలు	6	-	4
గోపవరం	3	1	1
కలసపాడు	8	3	1
పోరుమామిళ్ల	9	1	4
కాశినాయన	5	1	3
బ్రహ్మంగారిమఠం	8	3	3
జమ్మలమడుగు	8	4	4
కొండాపురం	6	3	3
నందలూరు	22	10	9
ఓబుళవారిపల్లె	14	8	1

వివరాలు

జిల్లాలో మంజూరైన కేంద్రాలు: 347
మంజూరైన నిధులు రూ. 2016.57 లక్షలు
వివిధ దశల నిర్మాణాల్లోనివి: 131
వ్యయం అయిన నిధులు: రూ. 35.21 లక్షలు
పూర్తయిన కేంద్రాలు: 109
ఖర్చు చేసిన నిధులు రూ. 93.81 లక్షలు



చెన్నారెడ్డిపల్లెలో పూర్తయి నెలలు గడుస్తున్నా అప్పగించని అంగన్వాడీకేంద్రం

దారుణంగా ఉంది



చెన్నారెడ్డిపల్లెలో 10 ఏళ్లుగా అద్దె భవనంలో అంగన్వాడీ కేంద్రం నడుస్తుంది. ప్రభుత్వం అద్దె నెలకు రూ. 500 చెల్లిస్తున్నారు. చేతి నుంచి మరో రూ. 200 భరిస్తున్నా. చాలీచాలని వసతులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 4 నెలల క్రితం కొత్త భవనం నిర్మించారు. దీన్ని అప్పగించడంలో అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. మా గోడు ఎవ్వరూ పట్టించుకోవడంలేదు.

- ఒ.విజయమ్మ, అంగన్వాడీ కార్యకర్త, చెన్నారెడ్డిపల్లె

బిల్లులు చెల్లించనందునే అప్పగించడంలేదు

పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 168 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 82 కేంద్రాలకు నిర్మాణాలు జరుగుతున్నాయి. 40 కేంద్రాలకు కొత్తగా స్థలం సమకూరింది. కలసపాడు మండలంలో బిల్లులు రాలేదని గుత్తదారుల పూర్తయిన భవనాలు అప్పగించడంలేదు. పూర్తయినవి సమగ్ర సమాచారంతో అప్పగించడంలో పీఆర్ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. దీంతో చాలా కేంద్రాలు అద్దె భవనాలు, పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి.

- హైమావతి, ఐసీడీస్ సీడీపీవో, పోరుమామిళ్ల



పాతరామాపురంలో పైకప్పు స్థాయిలో ఉన్న అంగన్వాడీ కేంద్రం

15 ఏళ్లుగా అద్దె భవనంలో...

పాతరామాపురంలో 15 ఏళ్లుగా అద్దె భవనంలో అంగన్వాడీ కేంద్రం కొనసాగిస్తున్నాం. అధికారుల ఆదేశాలతో ఏడాది నుంచి శిథిల పాఠశాల భవనాకి కేంద్రాన్ని తరలించాం. పాఠశాల పైకప్పు దెబ్బతింది. అప్పుడప్పుడు పెచ్చులూడి పడుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా భవనం ఉరుస్తోంది. కొత్త భవనం త్వరగా నిర్మించి అప్పగిస్తే చిన్నారులకు కష్టాలు తీరుతాయి.

- లక్ష్మీదేవి, పాతరామాపురం

పనులు వేగవంతం



నియోజకవర్గంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్రాల భవనాలు వేగవంతంగా నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలో 66 కేంద్రాలు మంజూరుకాగా 56 పూర్తయ్యాయి. 20 కేంద్రాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. పూర్తయిన వాటిని నెలలోపు అప్పగిస్తాం

- వెంకటశివారెడ్డి, పీఆర్ డీఈ

త్వరగా అప్పగిస్తాం..



కలసపాడు మండలంలో 6 నెలల క్రితం 8 అంగన్వాడీ కేంద్రాలు మంజూరు అయ్యాయి. ఇవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. గతంలో నాబార్డు, ఎస్‌డీపీ నిధులతో నిర్మించిన కేంద్రాలను అప్పగించడానికి సిద్ధంగా ఉన్నా ఐసీడీఎస్ అధికారులు సహకరించడం లేదు. సమగ్ర సమాచారం కావాలని కోరుతున్నారు. గతంలో వేరే అధికారి కొంత నిర్మాణం చేపట్టారు. అందుకు సంబంధించిన నా వద్ద లేదు. అధికారికంగా కేంద్రాలు అప్పగించేందుక సిద్ధంగా ఉన్నాం.

- వెంకటరత్నం, పీఆర్ ఏఈ, కలసపాడు.

స్వయం స్వతంత్ర పాఠశాలల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

రాయచోటి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలహీన పరిచే స్వయం పోషక స్వతంత్ర పాఠశాలల ఏర్పాటుకు ఉపసంహరించుకోవాలని రాయలసీమ పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ వై.రవీంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ జోక్యం లేకుండా పారిశ్రామిక వేత్తలచే కొత్త ప్రైవేటు పాఠశాలల ఏర్పాటు వల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. న్యాస్థానానికి వెళ్లే అవకాశం లేకుండా డ్రాఫ్టురూల్స్ రూపొందించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా సంస్థలకు సైతం రూ.కోట్లు నిధులు విడుదల చేయడం ప్రకటించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను పద్ధతిని పునరుద్ధరించే వరకు రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఉపాధ్యాయులకు త్వరలో ఏకీకృత సర్వీసు రూల్స్‌కు అనుగుణంగా కొత్త నిబంధనలు విడుదల అవుతాయన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈవో, పీవో పోస్టుల భర్తీకి రెండు, మూడు రోజుల్లో డీపీసీ సమావేశం కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలకు విద్యా శాఖ బడ్జెట్ నుంచి జీతాలు చెల్లించాలన్నారు. ఎయిడెడ్, గురుకుల, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేసి ప్రతి నెలా 1న వేతనాలు చెల్లించడానికి తాను కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాయచోటి, చిన్నమండెం, రామాపురం, వీరబల్లి, గాలివీడు, సంబేపల్లె, లక్కిరెడ్డిపల్లె, సుండుపల్లె మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక

కడప క్రీడలు, న్యూస్‌టుడే: కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో ఆదివారం అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు జరిగాయి. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు ఎం.వెంకటశివారెడ్డి, కార్యదర్శి ఎం.రామ్మూర్తి పర్యవేక్షణలో ఈ ఎంపికలను నిర్వహించారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా నాగభూషణం, అశ్విన్‌కుమార్‌రాజు, శివప్రసాద్, ఖాజామైనుద్దీన్ వ్యవహరించారు. జిల్లా నలుమూలల నుంచి 115 మంది క్రికెటర్లు ఎంపికలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి మాట్లాడుతూ.. క్రికెట్‌లో రాణించేందుకు అండర్-14 విభాగం అనువైందన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో క్రికెట్ ఆడాలని సూచించారు. సెలెక్షన్లలో ప్రతిభ కనబరిచిన 43 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశామని చెప్పారు. వీరికి త్వరలో ప్రాబబుల్స్ మ్యాచ్‌లు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తారన్నారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ఒంగోలు, పేరిచర్ల, నరసరావుపేట ప్రాంతాల్లో అండర్-14 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు జరుగుతాయని చెప్పారు.



క్రికెట్ నెట్ సెలక్షన్‌లో పాల్గొన్న క్రికెటర్లు

TENTH English

ప్రతిభ

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

✪ *Fill in the blanks with suitable Simple Prepositions.*

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

✪ *Fill in the blanks with suitable Compound prepositions.*

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc,

Examples:
1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

✪ *Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them*

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.
2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

✪ *Fill in the each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.*

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్
ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24

2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం

3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ

4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.

5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం

6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందుకంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం

7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత

8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.

9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ

10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే

11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ

12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ

13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్

14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3

15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు

16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C

17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.

18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి

19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం

20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం

21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25

22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$

23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం

24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం

25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ — ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ ఛోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహూరు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహూరు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.

ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపూర్ణం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

హాయ్! బుజ్జీ!!

ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే	5. Pay	వే
2. Flute	వే	6. God	వే
3. Speed	వే	7. Function	వే
4. Heat	వే	8. Dawn	వే

- **డీ దయామతి,** హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!





హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.

చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!

- **బరాటం రామారావు,** నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- **జీ రమేష్,** పెనుబర్తి


ఏది భిన్నం?



a



b



c

పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.



'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- **పెండెం జగదీశ్వర్**

జవాబులు: ఏది భిన్నం: a చిలిపిప్రశ్న: తినలేం కాబట్టి! సరదా పదాలు: 1. వేసవి 2. వేణువు 3. వేగము 4. వేడిమి 5. వేతనం 6. వేలుపు 7. వేడుక 8. వేకువ

ట్రిపుల్ ఐటీల్లో క్రీడా కోటా సీట్ల ప్రకటన జారీ

● 19 మంది విద్యార్థుల ఎంపిక ● 23న ప్రవేశాలు

స్పందనకు వందనం

వేంపల్లె, న్యూస్‌టుడే : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో క్రీడా కోటా సీట్లకు ఎంపికైన 19మంది విద్యార్థుల వివరాలను వర్సిటీ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఈ సీట్లకు ఎంపికైన వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 2017-18 విద్యా సంవత్సరానికిగాను ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు 4 వేల సీట్లు కేటాయించారు. ఈ మేరకు పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి జులై 5, 6, 7, 8వ తేదీల్లో వారికి ప్రవేశాలు కల్పించారు. నిరీక్షణ జాబితా, వికలాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు కూడా ప్రవేశాలు కల్పించారు. క్రీడా కోటా కింద నాలుగు ట్రిపుల్ ఐటీలకు కలిపి 19 సీట్లు కేటాయించారు. వీటికి రాష్ట్ర నలుమూలల నుంచి 1300 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు జులై 16న నూజివీడు ట్రిపుల్ ఐటీలో క్రీడా కోటా కింద దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ధ్రువపత్రాలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాప్), వర్సిటీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్రీడా కోటా కింద దరఖాస్తులు చేసుకున్న వారి ధ్రువపత్రాలను శాప్ అధికారులు పరిశీలించి నెల రోజులు అవుతున్నా క్రీడా కోటా సీట్లకు ఎంపికైన వారి వివరాలు వర్సిటీ అధికారులకు ఇవ్వలేదు. ఈ విషయమై ఈనెల 10న 'ఈనాడు'లో 'ధ్రువపత్రాలు పరిశీలించారు.. సీట్లు ఇవ్వడం మరిచారు..!' అన్న శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన శాప్ అధికారులు ఎట్టకేలకు క్రీడా కోటా కింద ట్రిపుల్ ఐటీ సీట్లకు ఎంపికైన 19 మంది విద్యార్థుల వివరాలు ప్రకటించారు. ఇందులో ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు ఒక్కొక్క దానికి 5 చొప్పున 15 సీట్లు, నూజివీడుకు 4 సీట్లు కేటాయించారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి సంబంధించి జమ్మలమడుగుకు చెందిన అనిల్‌కుమార్, నందలూరుకు చెందిన చరణ్, అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన శ్రావణి, కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన శ్రేయశ్రీ, సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన తేజస్విని ఎంపికయ్యారు. ఒంగోలు ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఎర్రగుంట్లకు చెందిన హేమలత, గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన లక్ష్మీనిహారిక, సాయినిఖిత, రేపల్లెకు చెందిన లిఖిత, కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన కొండాలమ్మ ఎంపికయ్యారు. ఈ మేరకు వర్సిటీ అధికారులు సీట్లకు ఎంపికైన వారి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరచడమే కాకుండా వారి చరవాణిలకు సమాచారం అందించారు. ఈనెల 23న ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి ఇడుపులపాయలోను, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి నూజివీడులోను క్రీడాకోటా కింద ఎంపికైన విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు కల్పించనున్నట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. కాగా సూపర్ న్యూమరరీ కింద నాలుగు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన 656 మంది విద్యార్థులకు ఈనెల 23న ఆయా ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు కల్పించనున్నారు.

నేటి నుంచి ఏఐవైఎఫ్ జిల్లా స్థాయి వైజ్ఞానిక శిక్షణ తరగతులు

బ్రహ్మంగారిమఠం(మైదుకూరు), న్యూస్‌టుడే : బ్రహ్మంగారిమఠంలోని పర్యాటక అతిథి గృహంలో సోమవారం నుంచి మూడురోజులు ఏఐవైఎఫ్ విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి జి.మద్దిలేటి తెలిపారు. జవివే నాయకుడు బ్రహ్మారెడ్డి, సమాఖ్య జాతీయ నాయకులు జి.ఈశ్వరయ్య, ప్రొఫెసర్లు కె.రాజశేఖర్, బి.రామయ్య, రామకృష్ణారెడ్డి, వెంకయ్య, సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్ తదితరులు హాజరై శిక్షణ ఇస్తారన్నారు.

భజనమందిరం కూల్చివేత కేసులో పది మంది అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

హిందూపురం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా హిందూపురం బాలాజీనగర్ సమీపంలోని ఆర్యవైశ్య సంఘానికి చెందిన భజనమందిరం కూల్చివేత కేసులో పోలీసులు పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై పెనుకొండ డీఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కడపజిల్లా కొండాపురం మండలం కోడూరుకు చెందిన బి.నారాయణరెడ్డి, రామాంజనేయులు, సుధాకరరెడ్డి, మరో ముగ్గురితోపాటు తాడిపత్రికి చెందిన మరళీధర్‌రెడ్డి, గోపాలరెడ్డి, హిందూపురానికి చెందిన ఫజుల్ రెహమాన్, షేక్‌సాదిక్ శుక్రవారం రాత్రి వాహనంలో వచ్చారన్నారు. పొక్లెయిన్‌తో భజనమందిరాన్ని, పక్కనే ఉన్న చంద్రశేఖర్ ఇంటిని ధ్వంసం చేసి కన్యకాపరమేశ్వరి విగ్రహాన్ని ఉద్దేశపూర్వకంగా ఎత్తుకెళ్లిపోయారన్నారు. నిందితులు పట్టణ సమీపంలోని మనేసముద్రం వద్దనున్న ఓ కర్మాగారం సమీపంలో ఉన్నట్లు సమాచారం అందడంతో సీఐ ఇదురుబాషా, సిబ్బంది వెళ్లి అరెస్టు చేశారన్నారు. జేసీబీ, వారు వచ్చిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టణంలో ఇలాంటి ఘటనలు పునరావృతమవకుండా చూస్తామన్నారు. ఎవరైనా దుశ్చర్యలకు పాల్పడితే పోలీసులకు తక్షణం సమాచారం అందించాలన్నారు. సమావేశంలో సీఐలు ఇదురుబాషా, మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి ముద్ర

స్వయం సమృద్ధి సాధనకు రుణాలు



మారుతి నగర్‌లోని ఓ ఇంటిలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ పరిశ్రమ

ఎన్‌జీవో కాలనీ, (కడప న్యూస్‌టుడే): నిరుద్యోగ యువతకు ముద్ర భరోసా కల్పిస్తోంది. పీజీలు, డిగ్రీ చదువులు పూర్తి చేసిన ఎందరో నిరుద్యోగ యువత ఉపాధి వేటలో తలమునకలవుతున్నారు. ప్రస్తుత పోటీ కాలంలో ఉద్యోగాలు సంపాదించడం గగనంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కొందరు స్వతహాగా వ్యాపారం వైపు మొగ్గు చూపుతూ ఉపాధి మార్గం ఎంచుకుంటున్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ముద్ర పథకం చిరు వ్యాపారుల పాలిట కల్పతరువుగా నిలుస్తోంది. పెట్టుబడి పెట్టలేని వారు ప్రభుత్వం అందించే రుణాలు పొందుతూ అంచెలంచెలుగా పలువురు ఎదుగుతున్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులో ఒక్క దరఖాస్తు చేసుకొని రుణం పొంది తమ వ్యాపారాన్ని అభివృద్ధిపరుచుకునే చక్కటి అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుంది. చిరు వ్యాపారులు, వాణిజ్య సేవా రంగాలకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ముద్ర యోజనను ప్రారంభించింది. పేదరికం తొలిగినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఈ పథకాన్ని 2015 ఏప్రిల్ 8న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెట్టుబడులు లేక వ్యాపారాలు విస్తరించుకోవడం ఇబ్బందిగా ఉన్న చిరు వ్యాపారులకు ఈ పథకం కల్పతరువు లాంటిదని చెప్పవచ్చు. దీనికి ఎలాంటి జామీను, హామీలు లేకుండానే వ్యాపారులకు రుణ సౌకర్యం కల్పించే వెసులుబాటు కల్పించారు.

నిరుద్యోగ యువతకు భరోసా

ముద్ర రుణాలతో యువతకు భరోసా దక్కుతోంది. ఎలాంటి హామీలు, పూచీకత్తులు లేకుండా సులభతరంగా రుణాలు వస్తుండటంతో నిరుద్యోగ యువత అనేక మంది బ్యాంకుల నుంచి రుణాలు అందుకొని చిరు వ్యాపారులతో లబ్ధి పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 21 ప్రభుత్వ రంగ బ్యాంకులకు సంబంధించి 380కి పైగా బ్యాంకు శాఖలున్నాయి. రెండేళ్ల కిందట ప్రారంభించిన ప్రధాన మంత్రి ముద్ర యోజనను ఇప్పటి వరకు జిల్లాలో 3400 మంది వినియోగించుకున్నారు. వీరు రూ.18 కోట్ల వరకు బ్యాంకు రుణాలను పొందారు.

మూడు దశల్లో అమలు

● వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా వ్యాపారాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ఈ పథకం ప్రధానోద్దేశం. మూడు దశల్లో రుణాలు అందజేస్తారు.

● శిశు విభాగం కింద రూ.50 వేలు రుణం లభిస్తుంది. ఇందులో వీధి వ్యాపారులు, తోపుడు బండ్ల వారికి అందిస్తారు.

● రెండోది కిశోర్ విభాగంలో రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు రుణం అందిస్తారు. ఇందులో బ్యూటీ పార్లర్, ఆటో, ట్రక్కులు, క్షౌరశాల, తదితర స్థిర వ్యాపారులకు రుణాలు అందజేస్తారు.

● మూడో దశ తరుణ్ విభాగంలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలిస్తారు. బ్యాంకు నుంచి పొందిన రుణానికి వడ్డీ తక్కువగా ఉండటంతో పాటు రుణ చెల్లింపునకు గరిష్ఠ కాల వ్యవధి ఐదేళ్లపాటు నెలనెలా వాయిదాల రూపంలో చెల్లించవచ్చు.

● 2015-2016, 2016-2017 సంవత్సరానికి 3400 మందికి రూ.18 కోట్లను శిశు, కిశోర్, తరుణ్ విభాగాల కింద రుణసాయం అందింది. వీటిల్లో 25 శాతం వరకు రుణాలును నిరుద్యోగ యువత పొందారు.

● మారుతీనగర్ చెందిన సుజాత గత ఎనిమిదేళ్లు నుంచి కుట్టుమిషన్ కుడుతూ జీవన సాగిస్తుండేది. ఏడాది కిందట స్థానిక ఆంధ్రా బ్యాంకులో ముద్ర రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు నుంచి రూ.50 వేలు రుణం పొందింది. నెలకు రూ.1150 చొప్పున చెల్లిస్తున్నానని చెప్పింది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణం సాయంతో కుట్టు దుకాణాన్ని విస్తరించి దుకాణానికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశాను. అంతేగాకుండా నేను ఐదు మందికి పని కల్పించాను. నెలకు ఖర్చులు పోను రూ.13 వేల ఆదాయం మిగులుతుంది.

వ్యాపారాభివృద్ధికి రుణాలు

- ఆంజనేయచారి, లీడ్ బ్యాంక్ మేనేజర్



ముద్ర యోజన చిరు వ్యాపారులకు ఎంతో భరోసానిస్తోంది. ఏటా లక్ష్యం మేరకు బ్యాంకులు చిరు వ్యాపారులకు రుణాలు అందజేస్తున్నాయి. ఈ పథకం ద్వారా రుణం తీసుకుని సక్రమంగా వాయిదాలను చెల్లిస్తే లబ్ధిదారులకు మరింత వ్యాపార విస్తరణకు రుణాలు ఇస్తాం. చిరు వ్యాపారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కడపలో గుర్తు తెలియని వ్యక్తి హత్య

◆ తాగిన మైకంలో చంపినట్టు అనుమానం

◆ మృతుని ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



రక్తపుమడుగులో మృతుడు



అంతర్ చిత్రంలో మృతుడు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప ఒకటో పట్టణ ఠాణా పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడి ఆచూకీ తెలియరాలేదు. సమీప ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద తరచుగా కనిపించే వాడని స్థానికులు చెబుతున్నారు. మృతుని ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం వద్ద సీసీ కెమెరాలున్నప్పటికీ అవి పని చేయడం లేదు. ఘటనా స్థలాన్ని ఒకటో పట్టణ ఠాణా సీఐ సత్యనారాయణ, ఎస్సై హుసేన్‌లు పరిశీలించారు. తాగిన మైకంలో హత్య జరిగి ఉండొచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. సీఐ వివరాల మేరకు. . కడప రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు హత్య చేశారు. మృతుడు రక్తపుమడుగులో పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలుంటాయి. శనివారం రాత్రి 9.30 గంటలకు రైల్వేస్టేషన్ సమీపంలోని మద్యం దుకాణం వద్ద కనిపించాడని అక్కడున్న స్థానికులు చెప్పారు. తెల్లవారేసరికి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఘటనా స్థలంలో లావు కర్ర ఉంది. మృతుడు పరిసర ప్రాంతాల్లో ఖాళీ మద్యం సీసాలున్నాయి. బహుశా మద్యం తాగే సమయంలో ఘర్షణ రావడంతో కర్రతో కొట్టి హత్య చేసి ఉంటారని తెలుస్తోంది. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి విషయాన్ని పోలీసులకు సమాచారాన్ని ఇచ్చారు. మృతుడు స్థానికుడు కాదని తెలుస్తోంది. జులాయిగా తిరిగే వాడని సమాచారం. మద్యానికి బానిసయ్యాడని పోలీసులంటున్నారు. మృతుడి ఆచూకీ మాత్రం తెలియరాలేదు. పోలీసులు మృతుడి ఫోటో తీసుకుని సమీపం మద్యం దుకాణాల వద్దకు తీసుకెళ్లి అతని వివరాలను ఆరా తీస్తున్నారు. మృతుడు హత్యకు గురైన చోట ఉన్న విద్యుత్తు స్తంభానికి రెండు సీసీ కెమేరాలున్నాయి. కానీ అవి పని చేయడం లేదు. దీంతో నిందితులు ఎవరనేది గుర్తించలేకపోయారు. కేసు నమోదు చేసి మృతుడి ఆచూకీ, నిందితుల కోసం గాలిస్తున్నామని సీఐ చెప్పారు.

గుట్కా వ్యాపారి అరెస్టు

రూ. 3 లక్షల విలువైన పొట్లాల స్వాధీనం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు మండలం యానాది కాలనీలో రూ. 3 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీతల సుబ్రహ్మణ్యం అనే నిందితుడు గుట్టు చప్పుడు కాకుండా పాకెట్లను విక్రయిస్తున్నారన్న సమాచారం రావడంతో ఆదివారం దాడి చేసి పట్టుకున్నామని గ్రామీణ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. నిందితుడు సిగరెట్ల వ్యాపారం చేసేవారని ఇదే క్రమంలోనే మత్తునిచ్చే గుట్కా ప్యాకెట్లను అమ్మేందుకు తన ఇంట్లో 12 బ్యాగులను సిద్ధంగా పెట్టుకున్నారన్నారు. తమకు రాబడిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకుని రూ. 3 లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనపరుచుకున్నామని ఎస్సై విలేకరులకు తెలిపారు. నిషేధించిన గుట్కాలను ఎవరైనా అమ్ముతున్నట్లు సమాచారం అందితే చట్టపరమైన కేసులు బనాయిస్తామని ఎస్సై చంద్రశేఖర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు వెంకటసుబ్బయ్య, గురుశేఖర్ పాల్గొన్నారు.



అరెస్టు చేసిన నిందితుడితో ఎస్సై చంద్రశేఖర్, పోలీసులు

నగరంపై మేఘమాల.. పల్లెల్లో కరవు మేళా



బిల్టప్ వద్ద విజయదుర్గా ఆలయంపై కమ్ముకున్న కారుమేఘం



ఏడు రోడ్ల కూడలిలో...



యాదాలం వెంకటాచలం వీధిలో...

ఆగస్టు పూర్తవుతున్నా.. వినాయక చవితి దగ్గర పడుతున్నా వరుణుడికి జిల్లాపై కరుణ కలగ లేదు.. ఆదివారం నగరంపై కారు మేఘాలు కమ్ముకున్నాయి. పరిస్థితి చూస్తే కుండపోత వర్షం కురుస్తుందేమోనని అనుకున్నారంతా.. కానీ పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. ఊరించిన మేఘం కరిగి కనుమరుగై పోయింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో అక్కడక్కడ నీరు నిలిచింది. విజయా కూడలి వద్ద కల్వర్టు పనులు జరుగుతుండడంతో భారీగా నీళ్లు నిలిచాయి. ఆ చిత్రాలే ఇవి. - చిత్రాలు : శ్రీనివాస పట్నాయక్

కళలు ప్రోత్సహించేందుకు చక్కటి వేదిక

స్టెప్ సీఈవో మమత ● ఆద్యంతం అలరించిన యువజనోత్సవం



ఆకట్టుకున్న వివేకానంద ఏకపాత్రాభినయం



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు



అలరించిన భరతనాట్యం

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: మన కళలు, సంస్కృతీ సంప్రదాయాలు మరచిపోకుండా యువత దృష్టిని ఆకర్షించేందుకు యువజనోత్సవం చక్కటి వేదికని స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి మమత అన్నారు. ఆదివారం స్థానిక పీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన యువజనోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాలను డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గతంలో జిల్లా స్థాయిలో మాత్రమే ఈ ఉత్సవాలు నిర్వహించే వాళ్లమని దానివల్ల పూర్తిస్థాయిలో కళాకారులకు న్యాయం జరిగేది కాదని అందుకే ఈ సారి డివిజన్ స్థాయిలో జరుపుతున్నట్లు చెప్పారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారు జిల్లాస్థాయిలో తదుపరి రాష్ట్రస్థాయి కళాకారులుగా ఎంపిక చేస్తామన్నారు. విజేతలకు స్వామి వివేకానంద జయంతి (జనవరి 18) రోజున బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. మొత్తం 18 విభాగాల్లో పోటీలకు ఆహ్వానించగా 10 విభాగాల్లో కళాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్టెప్ సీఈవో మమత


అలరించిన కార్యక్రమాలు : డివిజన్‌లోని 16 మండలాల నుంచి కళాకారులు హాజరై తమ కళలను ప్రదర్శించారు. చెక్క భజన, జానపద నృత్యాలు, గేయాలు, ఏకపాత్రాభినయం, తబలా, హార్మోనియం, ఫ్లూట్, కూచిపూడి, భరత నాట్యం తదితర విభాగాల్లో కళాకారులు ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో మల్లయ్య, పీఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రదీప్, స్టెప్ అధికారి సుబ్రమణ్యం, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి

నంద్యాలలో విజయం మనదేనంటూ నేతలకు స్పష్టం



ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికి వెలుపలికి వస్తున్న కలెక్టర్, ఎస్పీ, పుత్తా తదితరులు



ముఖ్యమంత్రి వచ్చిన హెలికాప్టర్ ఇదే..

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హైదరాబాద్‌కు వెళ్లారు. నంద్యాలలో జరిగిన ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని ఆదివారం ఆయన కడప మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. ముందుగా నిర్దేశించిన సమయం కంటే రెండు గంటల ఆలస్యంగా ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం 4.20 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ బాబూరావునాయుడు, ఎస్పీ బాబూజీ, తెలుగు దేశం పార్టీ నాయకుడు పుత్తా నర్సింహారెడ్డి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన పుత్తా నర్సింహారెడ్డి ఇతర నాయకులతో నంద్యాలలో విజయం మనదేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. అనంతరం సాయంత్రం4.27 నిమిషాలకు అక్కడున్న ప్రత్యేక విమానంలో హైదరాబాద్ బేగంపేటకు వెళ్లారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో చిన్నరాముడు, కడప డీఎస్పీ మాసూంబాషా, తహశీల్దారు మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని సులువుగా అందించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: శాస్త్ర సాంకేతిక అంశాలపై విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధించాలని సైన్సు క్లబ్ జిల్లా కన్వీనర్ గోపీనాథరెడ్డి అన్నారు. నగరంలోని నగరపాలకు ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం సీవీ.రామన్ సైన్సు క్లబ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, జిజ్ఞాసను పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కృష్ణారెడ్డి జన్యుశాస్త్రం గురించి వివరిస్తూ ఏక సంకరీకరణ, ద్విసంకరీకరణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా అనంతరం డివిజన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఇన్‌స్పైర్ గురించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బయ్యపురెడ్డి కాంతి పరావర్తనం, కార్యదర్శి వెంకటసుబ్బయ్య ప్రాక్టికల్స్, విజయేశ్వరి జీవశాస్త్రంపై వివరించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి